

మరణశిక్షను రద్దు చేసిన

# జింబాబ్వే

జింబాబ్వే, జనవరి : జింబాబ్వే మరణశిక్షను రద్దు చేసింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం చివరిసారిగా ఈ శిక్షను అమలు చేసిన దేశంలో ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. 1960వ దశకంలో జరిగిన స్వాతంత్ర్య యుద్ధంలో ఒకప్పుడు మరణశిక్షను ఎదుర్కొన్న అధ్యక్షుడు ఎమ్మెర్సన్ మ్నంగాగ్వా పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు ఆమోదముద్ర వేశారు. జింబాబ్వేలో ఇప్పటికే దాదాపు 60 మంది ఖైదీలు మరణశిక్షలో ఉన్నారు. ఈ కొత్త చట్టం వారిని విడిచిపెట్టింది. దేశం చివరిసారిగా 2005లో ఒకరిని ఉరితీసింది.

2వ పేజీలో...

విదేశీ పర్యటనకు

# సీఎం రేవంత్ రెడ్డి



- ఈ నెల 20 నుంచి 24 వరకూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక 55వ వార్షిక సదస్సు
- జనవరి 21 నుంచి మూడు రోజుల పాటు దావోస్ సదస్సులో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి
- 15 నుంచి 19 వరకూ ఆస్ట్రేలియాలో సీఎం బృందం పర్యటన
- 19,20 తేదీల్లో సింగపూర్‌లో పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 15 నుంచి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్‌లో రేవంత్ బృందం పర్యటించనుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా ఈ నెల 20 నుంచి 24 వరకు 5 రోజుల పాటు ప్రపంచ ఆర్థిక వేదిక 55వ వార్షిక సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో జనవరి 21 నుంచి 23 వరకూ సీఎం రేవంత్‌తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజన్, ఇతర ఉన్నతాధికారులు ఆ సదస్సులో పాల్గొననున్నారు.

2వ పేజీలో...



కోడి పందేలకు

# సిద్ధం !

- బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు
- నాయకుల అండదండలతో భారీ ఏర్పాట్లకు ప్రయత్నాలు

కాకినాడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: కోడి పందేలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సిద్ధమవుతోంది. బరుల ఏర్పాటు కోసం నిర్వాహకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నాయకుల అండదండలతో భారీగా నిర్వహించే సన్నాహాల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భారీగా నిర్వహించాలనే యోచనలో ఆయా పార్టీల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా.. పండుగ మూడు రోజులూ యథేచ్ఛగా కోడిపందేలను నిర్వహించారు. గతేడాది రూ.230 కోట్ల వరకూ చేతులు మారాయి. ఈ ఏడాది అంతకు మించి అన్నట్లుగా ఏర్పాట్లలో నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

2వ పేజీలో...





కూటమి ప్రభుత్వంతో

# భవిష్యత్‌పై భరోసా

- తప్పుచేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- 2024 చరిత్ర తిరగరాసిన సంవత్సరం
- అమరావతితో సినిమా రంగానికి మంచిరోజులు
- మీడియా ఇష్టాగోష్టిలో సిఎం చంద్రబాబు

అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి1 : ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉంది. ప్రజల ఆలోచనలు, అవసరాల మేరకు పాలనా విధానాలను మార్చుకుంటున్నాం. అధికారులు కూడా ప్రజల ఆకాంక్షల మేరకు పనితీరు మార్చుకోవాలని సిఎం చంద్రబాబు అన్నారు. 2024.. చరిత్ర తిరగరాసిన సంవత్సరమని ముఖ్య మంత్రి చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లు ప్రజలు పడిన ఇబ్బందులకు విముక్తి కలిగిందని, ఇదే సమయం లో మీడియా కూడా ఇబ్బంది పడిం దన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందరికీ భవిష్యత్తుపై భరోసా వచ్చిందని పేర్కొన్నారు. మంగళగిరి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కొందరు అధికారులు జగన్ మాటలు విని పనిచేశారని పేర్కొన్నారు. జగన్.. చివరకు అధికారులను కూడా గత ఐదేళ్లు బురద గుంతలో తోసేశారని విమర్శించారు.‘ ఎమ్మెల్యేలకు దశలవారీగా కౌన్సిలింగ్ ఇస్తున్నా. తప్పుడు పనులు చేయొద్దని వారిని పదేపదే హెచ్చరిస్తున్నా. సమాజానికి హానికరమైన వారిని మాత్రం వదిలేది లేదు. గతంలో రౌడీయిజం, మతకలహాలను అణచివేసినట్లే ఇప్పుడూ చేస్తాను. కొన్ని అంశాల్లో పార్టీ శ్రేణులు, నా అభిప్రాయాల్లో తేడా ఉంటోంది.



## మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధిఇ జనవరి1 : దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కొత్త ఏడాది ఆరంభమైన బుధవారం, బీజేపీ రాజకీయాలకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. బీజేపీ తప్పులకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? అని కేజ్రీవాల్ నిలదీశారు. ‘బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బులు పంచుతున్నారు. ఓట్లు కొనేందుకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? దళిత, పూర్వాంచల్ ప్రజల ఓటర్లను పెద్ద ఎత్తున ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదని ఆర్ఎస్ఎస్ భావిస్తుందా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తోందా?’ అని కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రశ్నించారు. కాగా, కేజ్రీవాల్ లేఖపై బీజేపీ ఘాటుగా స్పందించింది. ‘అబద్ధాలు, మోసం అనే మీ తప్పుడు అలవాట్లను వదిలిపెట్టి మీలో అర్థవంతమైన మార్పు తీసుకువస్తారని ఆశిస్తున్నాం’ అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తాను లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు.



ప్రజా పాలనలో

# బీసీలకు పెద్ద పీట

3వ పేజీలో...



2వ పేజీలో...

చరిత్రలో కేసీఆర్

# నిలిచిపోతారు

- ఎవరి వల్ల కానిది కేవలం కేసీఆర్ వల్లే సాధ్యమైంది
- మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం బాగు మాజీ మంత్రి కేటీఆర్



మళ్లీ యాక్టివ్ గా

# హైడ్రా...

2వ పేజీలో...

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01, హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. తన పరిధిలో చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే.. నిబంధనలు, అనుమతులు అంటూ కాలయాపన చేయకుండా ప్రజా ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని కాపాడుకునేందుకు తక్షణమే రంగంలోకి దిగుతుంది. ఈ క్రమంలోనే హైడ్రా తాజాగా శేరిలింగం పల్లిలో అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. ఇక్కడి భగీరథమ్మ, తౌతానికుంట చెరువుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను పంపింది.హైదరాబాద్ నగర నిర్మాణం, అభివృద్ధితో పాటు ఇక్కడ ప్రకృతి సంపదల్ని.. తరాల పాటు ప్రజల అవసరాల్ని కాపాడేలా చేపట్టిన చర్యల్లో హైడ్రాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. విశేష అధికారాలు, ప్రభుత్వ పూర్తి అండదండలతో తమపర భేదం లేకుండా.. ఎక్కడ తప్పు జరిగితే అక్కడ హైడ్రా ప్రత్యక్షమవుతోంది.

అందులో భాగంగా.. కొత్త ఏడాది వేడుకలకు ముందు సైతం తన పవర్ చూపిస్తోంది. చెరువులు, కుంటల జోలికి వస్తే ఊరుకునేది లేదని తేల్చి చెబుతోంది.శేరిలింగంపల్లి మండలంలో పరిధిలోని ఖాజాగూడ ? నానక్ రామ్ గూడ ప్రధాన రహదారికి ఇరువైపులా భగీరథమ్మ, తౌతానికుంట చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని రీతిలో పుంజుకుని పరుగులు తీస్తోంది. అందుకే.. అక్రమార్కుల కళ్లు.. ఈ చెరువులపై పడ్డాయి. దాంతో.. రేకులతో ఆ స్థలాలను తమవిగా చెప్పుకుండా అడ్డుగోడ కట్టేశారు. దాంతో.. రంగంలోకి దిగిన హైడ్రా వెంటనే కూల్చివేతలు చేపట్టింది. ఈ చెరువుల భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని.. స్థానికులు ఫిర్యాదుల చేయడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతవారంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫిర్యాదు అందిన ప్రాంతంలో చెరువుల భూముల్లోనే నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు జరిగినట్టు అధికారులు నిర్ధరించారు. దాంతో.. కేసులో అక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. అక్రమణలపై నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి స్వచ్ఛందా అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే కూల్చివేతలకు పాల్పడుతున్నారు. పక్కా సమాచారం, సాంకేతిక ఆధారాలను దగ్గర పెట్టుకుని కూల్చివేతలు చేపడుతున్నారు. నూతన ఏడాది వేడుకలకు ముందు హైడ్రా దూకుడుతో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటల్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి కంటి మీద కునుకు ఉండడం లేదు.ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో హైడ్రా మరింత దూకుడుగా ముందుకు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పట్టుదల, చెరువుల్ని రక్షించాలనే సంకల్పంతో.. అక్రమార్కులపై మరిన్న చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. అలాగే.. త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్లు సైతం రానుండడంతో హైడ్రాకు ప్రత్యేక అధికారాలు రానున్నాయి.

ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం కాలయాపన చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ..అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూడా బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయలేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడం, రిజర్వేషన్ల పెంపు ప్రధాన డిమాండ్లుగా తాము మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బీసీ మహాసభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ పేర్కొన్నారు. తాము పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరవుతామని, తమ హక్కులను సాధిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు బీసీ మహాసభ పోస్టర్లను తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రదర్శించింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ..కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషికి తాము మద్ధతు ప్రకటిస్తున్నామ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొల్లా శివశంకర్, పెంట రాజేష్, సుంకోజు కృష్ణమాచారి, ఆలకుంట్ల హరి, కుమారస్వామి, విజేందర్ సాగర్, రాచమల్ల బాలకృష్ణ, కోళ్ల శ్రీనివాస్, సాల్వా చారి, మురళి, నిమ్మల వీరన్న, లింగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో కేసీఆర్ నిలిచిపోతారు

**మొదటిపేజీ తరువాయి...**

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని, ఎవరి వల్ల కానిది కేసీఆర్ వల్లే సాధ్యం అయిందని అది అందరికీ తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఆంగ్ల నూతన సంవత్సరం మొదటి రోజున తెలంగాణ భవన్‌కు విచ్చేసి బీఆర్ఎస్ నాయకత్వం మొత్తం ఇక్కడ కొలువుదీరి బీఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది. మనందరం మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నది ఒక్కటే.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే ఒకే ఒక్క కోరితో గట్టిగా పని చేస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో మన పార్టీ మరిన్ని విజయాలు నమోదు చేయాలని, ప్రజల ఆశీస్సులు పూర్తిస్థాయిలో తిరిగి పొందాలని, మనకు ఎదురయ్యే అడ్డంకులు ఎదుర్కొనే శక్తి ఆ భగవంతుడు మీకు ప్రసాదించాలని, మీ కుటుంబాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. కులమతాలకు అతీతంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ దేశం, రాష్ట్రం ఎల్లవేళలా ప్రశాతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్‌కు గులాబీ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేత కేటీఆర్ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# నగర వాసులకు రేవంత్ తీపి కబురు

## మేడ్చెల్, శామిర్ పేటలకు మెట్రో పొడిగింపు
## డిపిఆర్ సిద్ధం చేయాలని ఎన్వీరెడ్డికి ఆదేశం

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. మెట్రో రైలు పొడిగింపులో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్యారడైజ్–మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్–శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్–2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్ఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్–2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.

# కూటమి ప్రభుత్వంతో భవిష్యత్‌పై భరోసా

**మొదటిపేజీ తరువాయి...**

కొందరు కార్యకర్తలు తమ అజెండాను నేను అమలు చేయాలని అనుకుంటున్నారు. జగన్ మాదిరిగా మేమూ తప్పులు చేస్తే ఎలా.. ప్రజలన్నీ గమనిస్తూనే ఉంటారు. నాకు నా ప్రజలే హైకమాండ్. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు. గత విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నాం అన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంతోనే.. ప్రత్యర్థులకు సరికొత్త వార్నింగ్ ఇచ్చారు. ఇక ఆట మొదలైందని.. ఎవరినీ వదిలిపెట్టబోనని స్పష్టమైన ప్రకటన చేశారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. తాను జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే కొంతమందికి మిసరబుల్ ట్రీట్‌మెంట్ ఉంటుందని అన్నానని గుర్తు చేశారు. ఆ మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. అయితే, తాను రాజకీయ కక్ష తీర్చుకోబోనని.. తప్పు చేసిన వారిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. 1995 సీఎంను త్వరలో మీరే చూస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఇక గేమ్ స్టార్ట్ అయ్యింది. సోషల్ మీడియా వ్యవహారంలో మీరు చూశారు కదా. మిగతా కేసులు కూడా అలానే డీల్ చేస్తాను. కేడర్ ఉద్దేశ్యం ఒకలాగా ఉంది. నా లక్ష్యం వేరుగా ఉంది. ఎందుకంటే.. నేను అందరి అభిప్రాయాలు తీసుకోవలి. అవతలి వాళ్లు చేసినట్లు నేను చేయను. చట్టం, న్యాయం ప్రకారం చేస్తాను. నేను ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదు.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మా కేడర్, నాయకులు లేదా అధికారులు ఎవరు తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలను పిలిచి అందరితో మాట్లాడుతున్నాను. అందరినీ కరెక్ట్ చేస్తాను. అలాగే కలిసి ముందుకు వెళ్తాను. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలిచేలా ఉండాలి. 2004 లో నన్ను ఎవరూ ఓడించలేరు. హైదరాబాద్‌ను ఎన్నడూ లేని విధంగా డెవలప్ చేశాను. కానీ, ప్రజలకు ఈ విషయాన్ని కమ్యూనికేట్ చేయలేకపోయాను. ఇప్పుడు ప్రజలకు చెప్పి మనం ముందుకు తీసుకెళ్లాలి.' సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. గతంలో మా పార్టీ నేతలను హతమార్చారు. జగన్ హయాంలో మా పార్టీ వాళ్ళు బాగా ఇబ్బంది పడ్డారు. అందరినీ మేము చాలావరకు సర్దుబాటు చేస్తున్నాము. అందరికీ పదవులు ఇవ్వలేం కదా. ఈ సారి జాగ్రత్తగా ఉన్నాము.

# విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి...**

2024లో దావోస్ పర్యటన సందర్భంగా సుమారు రూ.40వేల కోట్లకుపైగానే పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు కంపెనీలతో చేసుకుంది. అవి కార్యరూపం దాల్చి వేర్వేరు దశల్లో ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపారు. ప్రస్తుత దావోస్ పర్యటనలోనూ మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం బృందం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు ముందు ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13నే పర్యటనకు ఏర్పాట్లు చేయాలని భావించినా, సంక్రాంతి పండుగ తర్వాత 15న బయలుదేరే ఆలోచన చేస్తున్నారని సమాచారం. సీఎం రేవంత్ ఆస్ట్రేలియా పర్యటనలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీ బాల, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియాలో క్వీన్స్‌లాండ్ క్రీడా విశ్వవిద్యాలయాన్ని వీరు పరిశీలిస్తారు. ఆస్ట్రేలియాలో మూడు నాలుగు రోజుల పాటు పర్యటించిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి బృందం జనవరి 19న సింగపూర్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ రెండు రోజుల పాటు షాపింగ్ మాల్స్‌పై క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను పరిశీలిస్తారు. సింగపూర్‌లో పారిశ్రామిక వేత్తల సమావేశంలోనూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొంటారు. అనంతరం దావోస్‌కు చేరుకుని ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్నారు.

# కోడి పందేలకు సిద్ధం !



**మొదటిపేజీ తరువాయి...**

అధికార పార్టీ నేతల సమక్షంలోనే ఈ పందేల నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలను, కొందరు నేతలను నిర్వాహకులు కలిసి అన్ని రకాలుగా మద్దతు పొందినట్లు సమాచారం. బరులకు సంబంధించి భారీ మొత్తంలో మామూళ్లు కూడా సమర్పించేందుకు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, తొండంగి, కరప, ఐ.పోలవరం, రాజోలు, సఖినేటిపల్లి, కొత్తపేట, అయినవిల్లి మండలాల్లో ఇప్పటికే బరులు ఏర్పాటు చేసే ప్రాంతాలను నిర్వాహకులు పరిశీలించారు. కొన్ని చోట్ల జంగిల్ క్లియరెన్స్ సైతం చేయించారు. ఆయా ప్రాంతాలకు ఎవరూ వెళ్లకుండా నిఘా పెట్టినట్టు సమాచారం. కోడిపందేలతోపాటూ గుండాట, పేకాట శిబిరాలను, అక్కడే మద్యం విక్రయాలు సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రూ.కోట్లలో లావాదేవీలు: సంక్రాంతి పండగ మూడు రోజులూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడిపందేలు, గుండాటలు జోరుగా సాగనున్నాయి. గతేడాది ఒక్కో బరి వద్ద రోజుకు 20 రౌండ్లలో కోడి పందేలు జరిగాయి. ఒక్కో రౌండ్‌కు చిన్న బరుల్లో రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు, పెద్ద బరుల్లో రూ.ఐదు లక్షల నుంచి రూ.20 లక్షలు, రాష్ట్ర స్థాయి బరుల్లో రూ.50 లక్షల నుంచి రూ. రెండు కోట్లు చేతులు మారాయి. ఈ ఏడాది కూడా ఇదే మాదిరిగా చేతులు మారే అవకాశం కనిపిస్తుంది.కోడి పుంజులకు గిరాకీ: సంక్రాంతి నేపథ్యంలో కోడిపుంజులకు గిరాకీ ఏర్పడింది. ఏడాది కాలంగా పెంచిన పందెం పుంజులను అమ్ముకుంటూ కొంతమంది ఉపాధి పొందుతున్నారు. ఒక్కో పుంజు రూ. ఐదు వేల నుంచి రూ.50 వేల వరకూ పలుకుతోంది. రంగు, సైజులను బట్టి పుంజు ధరను నిర్ణయిస్తున్నారు. జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు, కోనసీమలో లంక ప్రాంతాల్లో పుంజుల పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లు సైతం ముందుగానే చేసుకున్నారు.

# మరణశిక్షను రద్దు చేసిన జింబాబ్వే

**మొదటిపేజీ తరువాయి...**

ఈ చట్టాన్ని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆ దేశంలోని బానిసత్వ విముక్తికి ఆశాదీపంగా అభివర్ణించింది.కెన్యా, లైబీరియా మరియు ఘనా వంటి ఇతర ఆఫ్రికన్ దేశాలు ఇటీవల మరణశిక్షను రద్దు చేయడానికి "సానుకూల చర్యలు" తీసుకున్నాయి. అయితే ఇంకా చట్టం చేయలేదని మానవ హక్కుల సంఘం పేర్కొంది. మరణశిక్షకు వ్యతిరేకంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకారం, ప్రపంచంలోని మూడు వంతుల దేశాలు ఉరిశిక్షను ఉపయోగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 113 దేశాల్లో 24 ఆఫ్రికన్ దేశాలు మరణశిక్షను పూర్తిగా రద్దు చేశాయని పేర్కొంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా నమోదు చేసిన ఉరిశిక్షలు 1,153 అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. ఇది అంతకుముందు సంవత్సరం(883) కంటే పెరిగాయని తెలిపింది. అయినప్పటికీ ఉరిశిక్షలను అమలు చేసిన దేశాలు 20 నుండి 16కి తగ్గాయని పేర్కొంది. 2023లో అమ్నెస్టీ నమోదు చేసిన మొత్తం మరణశిక్షల్లో దాదాపు 90 శాతం ఇరాన్, సౌదీ అరేబియాలో ఉన్నాయని, ఆ తర్వాత సోమాలియా మరియు అమెరికా ఉన్నాయని పేర్కొంది.

# నూతన సంవత్సర వేడుకలు

మిర్యాలగూడ, యదార్ధవాది ప్రతినిది, జనవరి 01: మిర్యాలగూడ డివిజన్ లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం వరకు ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు పట్టణంలోని వివిధ చర్చిలలో ప్రార్ధనలు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుండి ప్రజలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని ప్రార్ధనలు చేశారు. మహిళలు ఇళ్ల ముందు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ రంగు రంగుల ముగ్గులు వేశారు. మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మున్సిపల్ పార్కులో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మాజీ చైర్మన్, కౌన్సిలర్ తిరునగరు నాగలక్ష్మి భార్గవ్ పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి వారికి తినిపించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి కె. రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# నూతన ఉజ్జీవంతో ముందుకు సాగాలి

## రెవరెండ్ వల్లూరి ప్రభాకర్

మంథని, యదార్ధవాది, జనవరి 01: కొత్త సంవత్సరంలో నూతన ఆలోచనలు చేస్తూ నూతన ఉజ్జీవముతో ముందుకు సాగాలని రెవరెండ్ వల్లూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం మంథని పట్టణంలోని సీయోను ప్రార్ధన మందిరంలో నూతన సంవత్సరం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో దేవుడు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చే విధంగా ప్రతిరోజు బైబిల్ చదువుతూ ప్రార్ధనలు చేస్తూ రోజురోజుకు ఆత్మీయంగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వాగ్దానాలను ప్రార్ధనాపూర్వకంగా స్వీకరించారు. నూతన సంవత్సర కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సహా పంక్తి భోజనాలు చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయారాజ్, కలువల సమూయేలు, గద్దల రాజేష్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎంకే జోసఫ్, మంథని ప్రసాద్, అందె రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, ఈర్ల సదానందం, దాసరి సదానందం, రామగిరి కుమార్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికునికి తీవ్ర గాయాలు



కమాన్ పూర్, యదార్ధవాది, జనవరి 01: కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన వడ్లకొండ నారాయణ గౌడ్ అనే గీత కార్మికునికి చెట్టు పైనుండి మంగళవారం సాయంత్రం పడగా తీవ్ర గాయాలయ్యాయి. వివరాలకు వెళ్తే వృత్తిలో భాగంగా నారాయణ గౌడ్ తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు తో పాటు కాలు జారడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో నారాయణ యొక్క తొంటి ఎముక విరగడం జరిగింది. నారాయణను హుటాహుటిన గౌడ సంఘం సభ్యులు మరియు చుట్టుప్రగల రైతులు ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ నారాయణకు ప్రభుత్వపరంగా నష్టపరిహారం చెల్లించాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

ఆలోచనలు చేస్తున్నారు. అదే కోణంలో పథకాలు గానీ, పనులుగానీ చేస్తున్నారు. దీంతో దేశం ముందుకు సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం,రూపాయి పతనం వంటి సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే. వాటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం లేదు. ధరల అదుపునకు చర్యలు లేవు. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా..రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. కొనుగోలుదారులు మాత్రం అధికధరలతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 140కోట్ల మంది భారతీయులు ఉన్న మన దేశంలో కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. దీనికతంటికి పాలకుల విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులను చేసి, పనులకు దూరం చేస్తున్నారు. ఈ సమస్యలపై చర్చించి ముందుకు సాగాలన్న బలమైన సంకల్పం పాలకుల్లో కొరవడింది. ఐదేళ్లు గడిచేలోగా..మరో ఐదేళ్లకు వేసుకునే ప్రణాళికలతో పాలకులు సాగుతున్నారు. సమిష్టి కృషితో దేశాన్ని ముందుకు నడిపిస్తు న్నామని ప్రధాని మోడీ నూతన సంవత్సరానికి ముందు ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలా అయితే భారతదేశం పురోగమించదని, ప్రజలు సమస్యలు, అప్పులు, పన్నుల భారం నుంచి బయటపడరని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇకపోతే భాగస్వామ్య పక్షాలుగా ఉన్నా టిడిపి,జనసేన తదితర పార్టీలు కూడా చొరవ తీసుకుని మంచి సలహాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. పెన్షన్లు 4వేలకు పెంచి పంచడమే గొప్ప ఘన కార్యాంగా ఎపి సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. మంత్రులు, పార్టీ పెద్దల సలహాలు తీసుకుని పాటించే ఆనవాయితీ మోడీకి ఎలాగూ లేదు. కనీసం భాగస్వామ్య పక్షాలతో అయినా చర్చించే పరిస్థితి లేదు. ఇకపోతే గతేడాది అనేక ముఖ్య ఘట్టాలను మనం పరిశీలించవచ్చు. దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టంగా భావించాలి. కొడిగట్టి పోతున్న కాంగ్రెస్‌కు నూనె పోసి దీపం వెలిగించిన ఘనత మోడీదే. మోడీ నిరంకుశ విధానాలతో కాంగ్రెస్ మళ్లీ బతికి బట్టకట్టింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడం ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాం. కానీ అయోధ్యలోనే బిజెపి పతనం చెందింది. కారణమేమంటే అక్కడి స్థానికులకు లబ్ది కలిగేలా, వారికి దారి చూపేలా పథకాలు అమలు కాలేదు. అయితే గత సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనదిగానే చెప్పుకోవాలి. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఇదో రకంగా మోడీకి శరాఘాతంగా భావించాలి. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు తిరుగులేదని అనిపించుకున్నారు. ఎన్నికల్లో గెలవడం తెలుసుకున్న మోడీ ప్రజల మనసులను మాత్రం గెలవలేకపోతున్నారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలను నరకయాతన పెడుతున్నా సమీక్షించుకోవడం లేదు. ఈ క్రమంలో 2025 ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరంగా భావించాలి. మారుతున్న ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో భారత్‌లో కూడా మార్పులు రావాల్సి ఉంది. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది. మోడీ ఇంతవరకు గట్టిగా నిలబడి ఏదేని సమస్యపై చర్చించిన దాఖలాలు లేవు. పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం లేకుండా పోతున్నది. 2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్‌ఆద్మీ పార్టీలు మనుగడకోసం కష్టపడు తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. అయితే మోడీ తన ఆర్థిక విధానాలను, పాలనా తీరును సమీక్షించుకోక తప్పదు. లేకుంటే మోడీ అస్తిత్వం కూడా ప్రశ్నార్థకం కాగలదు. దేశానికి దిశదశ చూపేలా రాజకీయాలు చేయాలి. ప్రజల బాటలో నడవాలి. అప్పుడే మోడీ నిలుస్తారు.

కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స్ వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లో అత్యధిక బుకింగ్స్ పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు. లో దుస్తులు సైతం కొందరు ఆర్డర్ పెట్టడం విశేషం.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కస్టమర్ కళ్లకు గంతలు కట్టి, చేతికి సంకెళ్లు కావాలని ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. వీటితో పాటు గతంలో ఎన్నడూ లేనంతగా కూల్ డ్రింక్స్, చిప్స్ విక్రయాలు పెరిగాయంటే ఎక్కువగా ఇంట్లో కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ జరుపుకున్నారని ఈకామర్స్ దిగ్గజాలు చెబుతున్నారు.

# ప్రజా పాలనలో బీసీలకు పెద్ద పీఠ

మొదటిపేజీ తరువాయి...

**-జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు**

**-సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశానికే తెలంగాణ ఆదర్శం**

**-కుల సంఘాలకు వెల్ఫేర్ బోర్డుల ఏర్పాటు**

**-గురుకులాలకు డైట్ కాస్మొటిక్ చార్జీల పెంపు**

**-బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**




హుస్నాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి : 2024 సంవత్సరాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ సహకారంతో విజయవంతంగా ముగించిందని, గత సంవత్సరం ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీ సంక్షేమ శాఖ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని అయన అన్నారు. 2024-25 బడ్జెట్లో 9200.32 కోట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కేటాయించడం జరిగింది. ఇది గత ఆర్థిక సంవత్సరం కన్నా 2971.32 కోట్లు అధికంగా విడుదల చేయడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే గీతన్న ల ఆవేదన గుర్తించి తాడి కార్పొరేషన్ ద్వారా గీతా కార్మికుల కొరకు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం లస్కర్ గూడ గ్రామంలో గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాటమయ్య రక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. గీత కార్మికుల భద్రతకై 10000 మందికి కాటమయ్య రక్షణ కిట్ లను వారికి శిక్షణ ఇచ్చి పంపిణీ చేయడం జరిగింది. రెండో విడత మరో 10 వేల మందికి కాటమయ్య రక్షా సేఫ్టీ కిట్ కొనుగోలు శిక్షణతో పాటు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 9న జీవో నెంబర్ 199 ఏర్పాటు చేసింది.. నిరంజన్ చైర్మన్ గా , రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి సభ్యులుగా బీసీ కమిషన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ధారించడానికి గాను ప్రభుత్వం భూసాని వెంకటేశ్వరరావు ఐఏఎస్ రిటైర్డ్ ను నియమించిందని అన్నారు. ప్రత్యేక కమిషన్ బీసీ జనాభా ప్రాంతం రిజర్వేషన్లు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తుంది. గత దశాబ్ద కాలంగా నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డైట్ మరియు కాస్మోటిక్ చార్జీలను ఏకంగా 40 శాతం పెంచడం జరిగిందని, 3 - 5 వ తరగతి గతంలో 950 రూపాయలు ఉంటే పెరిగిన ధరల ప్రకారం 1330 రూపాయలకు డైట్ చార్జీలు పెరిగాయి.8-10 వ తరగతి వరకు గతంలో 1100 - ఇప్పుడు 1540,ఇంటర్ - పీజీ 1500 - 2100 చార్జీలు పెంచింది. ప్రభుత్వ వసతి గృహాలు కాస్మోటిక్ ఛార్జీలు బాలికలకు 3-7 వ తరగతి కి గతంలో 55 - ప్రస్తుతం 175 కి పెరిగింది.8-10 వరకు గతంలో 75-275 కి పెరిగింది. బాలుర కి 3-7 వ తరగతి వరకు 62-150 కి,8- 10 వ తరగతి వరకు 62-200 వరకు పెరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా బీసీ వసతి గృహ విద్యార్థులకు సాంస్కృతిక ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ట్రాఫిక్ అవేర్నెస్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కాగ్నిజెంట్ ఐటి కంపెనీ ద్వారా రంగారెడ్డి హైదరాబాద్ మేడ్చల్ హాస్టల్ విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. బీసీ హాస్టళ్లకు పక్కా భవనాల నిర్మాణం 20 పక్క భవన నిర్మాణ కి రాష్ట్ర ప్రభుత్వం 100 కోట్లు కేటాయించింది. విద్యార్థుల సౌలభ్యం కొరకు బీసీ హాస్టల్ భవనాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరుగుతుంది. కళ్యాణ్ లక్ష్మీ పథకం లక్షా 16 రూపాయలు తులం బంగారం ఇవ్వడానికి తమిళనాడు అమలు చేస్తున్న విధివిధానాలను అధ్యయం చేసి రిపోర్టు ప్రభుత్వానికి అందజేయడం అయినది. బిసి స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారు. గ్రూప్-1 కోచింగ్ ద్వారా 425 మంది అర్హత సాధించారు. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ -11, పోలీస్ కానిస్టేబుల్ 226, గురుకుల టీచర్ 35, డీఎస్సీ ఎస్జీటీ ఆన్లైన్ అప్లై కోచింగ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు 290 మంది, బిసి స్టడీ సర్కిల్ ద్వారా 3579 మంది విద్యార్థుల కోసం వివిధ నైపుణ్య శిక్షణ తరగతులు ఇవ్వడం జరిగిందని, సుదీర్ఘ నిరీక్షణకు తెర తీస్తూ ప్రభుత్వం స్వల్ప వ్యవధిలోనే పది కార్పొరేషన్లు బీసీ వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేసిందని మంత్రి పొన్నం అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో వివిధ విభాగాలు 5136 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించడం జరిగింది. ప్రస్తుతం 2,06,680 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2024-25 కి 1569 కోట్లు బడ్జెట్ లో కేటాయించడం జరిగింది. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం జరిగింది. 153 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా 391 మంది విద్యార్థులు 10/10 జీపిఏ పాయింట్స్ సాధించారు. రాష్ట్రంలో కొత్తగా 8 %జూజు% లు స్థాపించబడ్డాయి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మొదటి దశలో 28 స్కూళ్లకు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది. ఒక్కో పాఠశాలకి 150 నుండి 180 కోట్ల ఖర్చు చేస్తూ 5000 రూపాయలు మొదటి దశలో నిధులు సమీకరించడం జరిగింది. జనాభా ప్రాతిపదికన కులాలకు రాజకీయంగా ,ఆర్థికంగా , సామాజికంగా ఎంత వాట ఉండలని నిర్ణయించడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిందని, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వివిధ పథకాలను అమలు చేస్తుంది. ఎంజెపి బీసీ లకు ఈబీసీ లకు ఓవర్సీస్ స్కాలర్షిప్ల , బీసీ లాయర్లకు ఇన్సెంటివ్ , ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న వారికి ఇన్సెంటివ్, బీసీ గురుకులాలు ,బీసీ స్టడీ సర్కిల్ లను నిర్వహిస్తుందని అయన అన్నారు.

మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి 80వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన అక్బర్ పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, భూంపల్లి భీమ్ రావు మాట్లాడుతూ స్వతహాగా చెరుకు ముత్యం రెడ్డి రైతు కాబట్టి రైతులు పడే కష్టాలను చూసి ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందించారని తెలిపారు. రైతులకు కరెంటు కష్టాలు తొలగించి, సబ్సిడీలు అందించి, నూతన వ్యవసాయ పద్ధతులను తీసుకువచ్చి రైతులకు అధిక దిగుబడి మరియు లాభాలు వచ్చే విధంగా చేశారని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గం ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారని తెలిపారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని నిస్వార్థ ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. చెరుకు ముత్యం రెడ్డి రైతు బాంధవుడుగా, అభివృద్ధి ప్రదాతగా, పేదల పెన్నిధిగా చిరస్థాయిగా ఈ రాష్ట్రంలో, దుబ్బాక నియోజకవర్గం లో నిలిచిపోయారని ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూతురి సుమలత, మండల ఫిషర్మెన్ అధ్యక్షులు అన్నబోయిన చంద్రశేఖర్, మాజీ సర్పంచ్లు గుండా శంకర్, పూజారి నారాయణ, మాజీ ఎంపీటీసీ పాతూరి శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు పల్లె అనిల్, గ్రామ శాఖ అధ్యక్షులు కూతురి చందు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్తే వెంకటేశం, ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, ఉత్తం నరేష్, కడవెరుగు నాగరాజు, మారి దుబ్బరాజు, జీడిపల్లి రమేష్, పోతారం నవీన్, తిప్పనబోయిన స్వామి, తిప్పనబోయిన యాదయ్య, నిజాముద్దీన్, తిప్పనబోయిన పున్నవ్వ, తిప్పనబోయిన విజయ, కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర ఆరాధన




సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: సూర్యాపేట బేతెస్థ ప్రార్ధన మందిరం నందు బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ కరుణ శ్రీ (హెప్సిబా ) ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర ఆరాధనా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్విట్స్, అరటి పండ్లు పంచిపెట్టినారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ ప్రజలందరికి, భక్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసు క్రీస్తు ఆశీస్సులతో 2025 లో సుఖసంతోషాలతో, ఉండాలని భక్తులను దీవించారు. ఈ కార్యక్రమం లో మీసాల తీతు, శీలం రామన్న ,యడవెల్లి యేసుపాదం,ఆదిమాళ్ళ బాబు, మామిడి వెంకన్న, మామిడి కిరణ్,రామకృష్ణ, సుధాకర్, వెంకన్న, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు

# యువత మత్తుకు బానిస కావద్దు

దుబ్బాక, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని దుబ్బాక వంద పడకల ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్.హేమ్ రాజ్ సింగ్ సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. మత్తుకు బానిసలై యువత విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని, ఒక ఆశయంతో ముందుకు సాగి విజయం సాధించాలని సూచించారు.

## స్వర్గీయ మాజీ మంత్రి ముత్యం రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన

**-మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు**



దుబ్బాక, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని తొగుట మండలం బండారుపల్లి మెట్టు గ్రామంలో మాజీ మంత్రివర్యులు స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమము మరియు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు చెరుకు ముత్యం రెడ్డి అని అన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.. వారితోపాటు నాయకులు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి మరియు దుబ్బాక నియోజకవర్గం లోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ మండల పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మాజీ ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, తాజా మాజీ సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ, సోషల్ మీడియా కోఆర్డినేటర్, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, మహిళా నాయకురల్లు, ప్రజా ప్రతినిధులు చెరుకు కుటుంబ అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: పబ్లిక్ క్లబ్ ను ఫ్యామిలీ క్లబ్ గా మారుస్తామని పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేనారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ లో 2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నూతన సంవత్సర డైరీలను సభ్యులకు అందజేస్తున్నమన్నారు. కమిటీ ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిందని ఇప్పటివరకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదని, నూతన విధివిధానాలతో ముందుకు వెళ్తామన్నామని అన్నారు. గత పాలకవర్గం నిర్వహణ లోపాలు వెలికి తీసి ఆడిట్ నిర్వహించి జనవరిలో కొత్త ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. భవిష్యత్తులో పబ్లిక్ క్లబ్ పట్టణ పౌరులందరికీ ఉపయోగపడేల చేస్తామన్నారు. గతంలో స్విమ్మింగ్ పూల్ శంకుస్థాపన చేయడం జరిగిందని త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ సహాయ కార్యదర్శి బోల్లె ద్దు దశరథ, కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, సభ్యులు శనగాని రాంబాబు, పోలేబోయిన నరసయ్య యాదవ్, సుదర్శన్ రెడ్డి, నిమ్మల వెంకటేశ్వర్లు రాచకొండ శ్రీనివాస్, గవ్వ కృష్ణారెడ్డి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పబ్లిక్ క్లబ్ ఫ్యామిలీ క్లబ్ గా మారుస్తాం

## -ఐద్వా ఆధ్వర్యంలో స్వీట్లు, పండ్లు పంపిణీ



మిర్యాలగూడ, యదార్థవాది ప్రతినిది, జనవరి 01: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఐద్వా వన్ టౌన్ కార్యదర్శి మనుల అరుణ, టూ టౌన్ అధ్యక్షురాలు ఊర్మిల కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయా చర్చిలలో కేకులు, స్వీట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశంలో మహిళలు సగభాగంగా ఉండి అన్ని రంగాలలో రాణించి ఉన్నత స్థానాల్లో ఎదగాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహిళలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం వారి అభివృద్ధికి ఐద్వా పని చేస్తుందని చెప్పారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. మహిళా సంఘం బలోపేతానికి మహిళలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మిర్యాలగూడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని మిర్యాలగూడ ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్.శ్రీనివాస్ కోరారు బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని కోరారు. సురక్షితంగా వాహనాలు నడిపేందుకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. స్థానిక డిపో మేనేజర్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జనవరి నెలాఖరు వరకు జరిగే మాసోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు పాటించవలసిన నియమ, నిబంధనల గురించి వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ భారతిబాయి డ్రైవర్లకు ఏకాగ్రతతో బస్సు నడపాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యాలయ నిర్మాణాలకు స్థలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



నర్సంపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యతో బుధవారం నర్సంపేట శాశనసభ్యులు దొంతి మాధవరెడ్డి అధికారులతో కలిసి విద్యాలయాలు నిర్మాణం చేపట్టెం దుకు స్థలాలను పరిశీలించారు.చెన్నారావు పేట మండలం అమినాబాద్ గ్రామంలో నిర్మాణం చేయనున్నటువంటి, తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రియ విద్యాలయం స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు, సంబంధిత అది కారులు ఉన్నారు.



సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: సూర్యాపేట 104ఏ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా రాచకొండ విజయలక్ష్మి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గత సంవత్సరం వాసవి క్లబ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలు గుర్తు చేస్తూ, గవర్నర్ గా పదవి విరమణ చేస్తున్న రాచర్ల కమలాకర్ అందించిన సేవలను కొనియాడారు. గత సంవత్సరం వాసవి క్లబ్ 104ఏ తెలంగాణ రాష్ట్రములో అత్యుత్తమ సేవలని అందించి, ఉత్తమ సేవా పురస్కారాలు సాధించిందని పలువురు వక్తలు అన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన మన ఊరికి మన గవర్నర్ కార్యక్రమంలో పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నూతన గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, క్యాబినెట్ సెక్రటరీ బిక్కుమళ్ల కృష్ణ, క్యాబినెట్ ట్రెజరర్ వెంపటి శభరినాథ్ లు ఐఇసి ఆఫీసర్ల సమక్షంలో సింగిరికొండ రవీందర్, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్యామ్, గుండా శ్రీదేవి, చల్లా లక్ష్మయ్య, పబ్బతి వేణుమాధవ్ పలువురు ఆర్ సిలు, జెడ్ సిలు, పిఎస్ టి లు పాల్గొన్నారు.

# కార్మికులు హక్కుల కోసం పోరాడాలి




మిర్యాలగూడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మిర్యాలగూడ రైస్ మిల్ లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందాల్సిన పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. హక్కుల సాధన కోసం కార్మికులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం సిఐటియు కృషి చేస్తుందని చెప్పారు ఆపదలో ఉన్న కార్మికులను తోటి కార్మికులు ఆదుకొని ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి డా. మల్లు గౌతమ్ రెడ్డి, జిల్లా నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: ప్రతి డ్రైవర్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణా అధికారి జి. సురేష్ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ డి. సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో ఆయన ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రైవర్ ఉద్యోగులకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా డ్రైవర్ లు విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. డిపో మేనేజర్ డి. సురేందర్ గారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల జరుగకుండా ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల స్టిక్కర్లను, బ్యానర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఏ యం ఎఫ్ వీరా చారీ , డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు

# ఇంటి రుచులకు..పల్లె విందు..



సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: ఇంటి రుచులను ప్రజలకు అందించేందుకు పల్లె విందు హోటల్ ను నూతనంగా ప్రారంభించడం అభినందనీయమని జిల్లా బీఆర్ఎస్ నాయకులు గండూరి కృపాకర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన పల్లె విందు (మా ఇంటి రుచులు) హోటల్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రం దిన దినాభివృద్ధి చెందుతుండడంతో ఎలాంటి వ్యాపారమైనా నిర్వహించేందుకు అనువుగా ఉందన్నారు. మహనగరాలు సైతం అందించలేని ఆహార పదార్థాలు, ప్రత్యేక రుచులను సూర్యాపేటలో అందించడం జరుగుతుందన్నారు. ఆసుపత్రులు, జనావాసాల నడుమ చక్కటి వాతావరణంలో ఏర్పాటు చేసిన పల్లె విందు హోటల్ ను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు చిప్పలపల్లి భవాని నాగార్జున మాట్లాడుతూ నాణ్యమైన ఆహార పదార్థాలతో ఇంటి రుచులను అందించేందుకు పల్లె విందు హోటల్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. టీ, టిఫిన్ మొదలు చక్కని బిర్యాని వరకు అన్ని రకాల ఆహార పదార్థాలను సామాన్యులకు సైతం అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. పల్లె విందు రుచిని పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఆస్వాదించి ఆదరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో 1104 ట్రాన్స్కో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నేతకాని వెంకన్న, పిట్టల యాదగిరి నాయుడు, నాయకులు చక్రహరి నాగరాజు, మోత్కూరి సందీప్, గుడిసె శేఖర్, మీలా వంశీ, బెజగం ఫణి, రాచకొండ శ్రీనివాస్, నిర్వాహకులు నవీన్, వనపర్తి సురేష్, వెంకటనారాయణ, సోమయ్య, తొట్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

# ఆర్.జి.3 బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించిన జిఎంలు




కమాన్ పూర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : డిసెంబర్ నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు బుధవారం స్థానిక రామగిరి అతిథి గృహం నందు నిర్వహించిన ప్రెస్ మీట్ లో తెలియజేశారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో ఆర్.జి-3 ఏరియాకు నిర్దేశించిన 5.78 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 5.77లక్షల టన్నులు అనగా 100 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, నిర్దేశించిన 45.10 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి)వెలికితీత లక్ష్యానికి గాను, 39.23 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 87 శాతం ఓ.బి(మట్టి) వెలికి తీయడం జరిగిందని, అదేవిధంగా 6.59 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ డిసెంబర్ నెలలో ఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 3.28 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 2.83 లక్షల టన్నులు అనగా 86 శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 2.50 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.94 లక్షల టన్నులు అనగా 118 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు.అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కి డిసెంబర్ నెలలోనిర్దేశించిన 0.09 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.13 లక్షల టన్నులు అనగా 145 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, 0.06 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. అందుకు కృషి చేసిన ఉద్యోగులందరికి వారు అభినందనలు తెలియజేశారు. మున్ముందు ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి కృషి చేయాలన్నారు. అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం జి.రఘుపతి, ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖరబాబు, కె.యాదయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.వెంకట రమణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ యం.రావ్మోహన్, ఐఈ డిజియం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డిపియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓ పి.రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత మాసోత్సవాలు

మంథని, యదార్థవాది, జనవరి 01: మంథని టీజిఎస్ఆర్టిసి బస్సు డిపోలో డిపో మేనేజర్ వి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రమాద రహిత మాసోత్సవాలను బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా పెద్దపల్లి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. డ్రైవర్ల కు ప్రమాదాలు జరగకుండా విలువైన సలహాలు సూచనలను ఆయన అందజేశారు.మంథని డిపో మేనేజర్ కూడా డ్రైవర్ల కి డ్రైవింగ్ చేయడం లో, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు.నేటినుంచి జనవరి 31 వరకు ప్రమాద రహిత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. మంథని డిపో ' 0 ' ఆక్సిడెంట్ డిపో గా ఉన్నందుకు డిపో సిబ్బందిని అభినందించారు.

# దత్తాత్రేయ స్వామి దీవెనతో ప్రజలు చల్లంగా ఉండాలి

## రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు



కమాన్ పూర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : శ్రీ గురు దత్తాత్రేయ స్వామి దీవెనతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి అని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు హైదరాబాద్లోని మినిస్టర్ క్వార్టర్లలో కమాన్ పూర్ మండలం పెంచికల పేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అన్నవేన వేణు ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ స్వామి వారి క్యాలెండర్ క్యాలెండర్ను మంత్రి శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరువురాళ్ల శేఖర్, అనవేన స్వామి, గడ్డం నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : నూతన సవత్సరం సందర్భంగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, పెద్ది సుదర్శన్ రెడ్డి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు పెద్దికి బొకేలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** అమరావతి నిర్మాణానికి మాత్రం అరవై కోట్ల నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధం చేస్తున్నారు. రాజధాని నిర్మాణం కోసం అప్పులు చేసి మరీ జనవరి నెల నుంచి పనులు ప్రారంభించడానికి రెడీ అవుతున్నారు. సీఆర్డీఏ కు ఇప్పటికే ఇరవైనాలుగు వేల కోట్ల రూపాయల పనులకు సంబంధించి అనుమతిమంజూరు చేశారు. ఈవిషయాన్ని మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారు. మంత్రివర్గం కూడా ఆమోదం తెలిపింది. జనవరి నెల నుంచి పనులు ప్రారంభం కావాలని చంద్రబాబు అధికారులను ఇప్పటికే ఆదేశించారు.అయితే అమరావతిపై పెట్టిన శ్రద్ధ, ఖర్చుచేస్తున్న నిధులను సంక్షేమం కోసం మాత్రం పెట్టడంలో కూటమి సర్కార్ ఒకింత వెనకడుగు వేస్తుందన్న విమర్శలు బాగా వినిపిస్తున్నాయి.రాజధాని నిర్మాణం కావాలంటే ఉన్నట్లుండి అభివృద్ధి కాదని, కాలానుగుణంగా అక్కడ పరిస్థితులను బట్టి రాజధాని ప్రాంతం విస్తరిస్తుందన్నఅభిప్రాయం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తుంది. కానీ అదే పనిగా ఒకే పనికి ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి అసెంబ్లీ, సచివాలయం భవనాలను నిర్మించడం, అదీ ఇంత హడావిడిగా చేయడం ఎందుకన్న ప్రశ్నలు నెట్టింట వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వానికి రాజధాని అమరావతి ప్రాధాన్యత అంశమేకావచ్చు కానీ, అదే సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు కూడా అంతే అవసరమని చెబుతున్నారు. భారీగా ఆయన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికల మ్యానిఫెస్టోను చూసి జనం కూటమి పార్టీల వైపు మొగ్గారు. ఏదైనా సమతుల్యంతో పనులు జరగాలి. ఇటు అభివృద్ధి పనులు, అటు సంక్షేమం సమానంగా జరుపుకుంటూ వెళితే ప్రజల్లో కూడా ఎలాంటి వ్యతిరేకత రాదని, కానీ వేల కోట్ల నిధులు అమరావతిలో కుమ్మరించడంపై సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతుంది. రాజధానిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలు ఉన్నందున, వాటిని మళ్లీ నిర్మించకుండా ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై పెడితే బాగుంటుందన్న సూచనలు కూడా వెలువడుతు న్నాయి. అమరావతి అభివృద్ధి చెందినంత మాత్రాన పోలో మంటూ పెట్టుబడులు వచ్చిపడతాయా? అన్న ప్రశ్నలు కూడా వినపడుతున్నాయి. సొంత పార్టీ క్యాడర్ కూడా ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్ననిర్ణయాలపై పెదవి విరుస్తుంది. ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి మాటనిలబెట్టుకునే ప్రయత్నం చేయాలి తప్పించి, నిధులన్నీఒకేచోట కుమ్మరించడం ఎంత వరకూ సబబని మరి కొందరు సోషల్ మీడియాలో నేరుగా పార్టీ నేతలను నిలదీస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సుమారు యాభై ఏళ్ల అనుభవమున్న చంద్రబాబు నాయుడు ప్రజలనాడిని కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు చేపడితే బాగుంటుందన్న సూచనలు సైకిల్ పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నాయి.

ఇప్పుడు అలా కాదు. శిశువులకు కూడా గ్యాస్ సమస్య వస్తోంది. అంటే ఇది ఎంత ఇబ్బంది పెడుతుందో అర్థమవుతుంది. ప్రస్తుతం చాలా మంది గ్యాస్ ట్రబుల్ తో సతమతం అవుతున్నారు. ఇది ఒక కామన్ సమస్యగా మారిపోయింది. అయితే గ్యాస్ వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కానీ ఆహారం అనేది ముఖ్య కారణంగా చెప్పవచ్చు. శరీరానికి సరిపడని ఆహారాలను తిన్నప్పుడు అవి సరిగ్గా జీర్ణం అవక గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తాయి. దీంతో గ్యాస్ ట్రబుల్ సమస్య మొదలవుతుంది. అలాగే వేళకు భోజనం చేయకపోవడం, తినే పదార్థాల్లో అసమతుల్యత ఉండడం, అతిగా ఆహారం తీసుకోవడం, శీతల పానీయాలు లేదా మద్యం అధికంగా సేవించడం, పొగ తాగడం వంటివన్నీ గ్యాస్ ట్రబుల్ కు కారణమవుతున్నాయి. శారీరక శ్రమ చేయకపోయినా కూడా గ్యాస్ ఏర్పడుతుంది. **బీన్స్, యాపిల్స్, పప్పు దినుసులు..:** బీన్స్, పుట్టగొడుగులు, యాపిల్స్, కొన్ని రకాల పప్పు ధాన్యాలు, చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు, నూనె పదార్థాలను తినడం వల్ల కొందరికి సహజంగానే గ్యాస్ సమస్య వస్తుంది. ఇలా గనక జరిగితే ఈ పదార్థాలను తినడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేయాలి. అలాగే పాలు లేదా పాల ఉత్పత్తులు కొందరికి పడవు. వాటిని తీసుకుంటే వెంటనే పొట్టలో గ్యాస్ ఏర్పడుతుంది. ఇలా గనక జరిగితే పాల ఉత్పత్తులను మానేయాల్సి ఉంటుంది. పాలలో లాక్టోస్ అనే ప్రోటీన్ ఉంటుంది. గా ఉండే ఆహారాలను తిన్నా కూడా కొందరికి సరిగ్గా జీర్ణం కాక గ్యాస్ సమస్య వస్తుంది. ముఖ్యంగా బ్రౌన్ రైస్, బీన్స్, ఓట్స్, గోధుమలు, పలు రకాల పండ్లు, కూరగాయల్లో పీచు అధికంగా ఉంటుంది. ఇది జీర్ణం అవక గ్యాస్‌ను కలగజేస్తుంది. కనుక ఈ పదార్థాలతో గ్యాస్ ఏర్పడుతుంటే వెంటనే వీటిని తీసుకోవడం మానేయాలి. లేదంటే సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలు ఉంటాయి. **కొవ్వు పదార్థాలు..:** కొవ్వు పదార్థాలు సహజంగానే అందరికీ త్వరగా జీర్ణం కావు. కానీ తరచూ కొవ్వు పదార్థాలను తిన్నప్పుడు సరిగ్గా జీర్ణం అవడం లేదు, గ్యాస్ వస్తుంది అంటే.. ఈ పదార్థాలు పడడం లేదని అర్థం. కనుక ఇలాంటి వారు కొవ్వు పదార్థాలను తీసుకోవడం మానేయాలి. అలాగే ప్రాసెస్ చేయబడిన పాలు, ఇతర ఆహారాలను చాలా మంది నేటి తరుణంలో తింటున్నారు. కానీ ఇవి సరిగ్గా జీర్ణం కావు అనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఇవి కూడా గ్యాస్ సమస్యను కలగజేస్తాయి. అలాగే బయట బేకరీలలో లభించే పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, నూనె పదార్థాలు కూడా చాలా మందికి జీర్ణం కావు. ముఖ్యంగా జీర్ణం కాని ఆహారాలను తినడం వల్లనే గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. కనుక ఏ ఆహారాలను తింటే గ్యాస్ వస్తుందో గమనించాలి. అప్పుడు ఆ ఆహారాలను మానేస్తే గ్యాస్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇలా జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో కమాన్ పూర్ క్రీడాకారిని ప్రతిభ



**కమాన్ పూర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** రాష్ట్రస్థాయి సీఎం సీఎం కప్ అథ్లెటిక్ పోటీల్లో కమాన్ పూర్ క్రీడాకారుని నల్లవెల్లి ఆనంది ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించారు. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఆనందిని బుధవారం హనుమకొండ లోని జేఎన్ఎం స్టేడియంలో జరిగిన సీఎం కప్పు రాష్ట్ర స్థాయి అట్లే పోటీలలో అండర్ 16 సంవత్సరాల లో 600 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి ప్రతిభ చాటింది. అలాగే మండల కేంద్రంలో నల్లవెల్లి శంకర్ రెండవ కూతురు దీంతోపాటు ఎన్నో మార్లు అథ్లెటిక్ లో రానించి తన ప్రతిభను చాటుతోంది.. ఈ సందర్భంగా కోచ్ రమేష్ ,రవీందర్ కమాన్ పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యులు అన్న వేన లక్ష్మీరాజ్యం, బండ సాయి శంకర్, జబ్బార్ ఖాన్, తదితరులు అభినందించారు.

# ఒంటినిండా బంగారంతో శ్రీవారిని దర్శించుకున్న భక్తుడు



### సోషల్‌మీడియాలో వీడియో వైరల్

**తిరుమల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** న్యూ ఇయర్ సందర్భంగా తిరుమల శ్రీవారిని ఓ భక్తుడు దర్శించుకోవడం ఇప్పుడు వైరల్‌గా మారింది. ఏడుకొండల వాడిని రోజుకు లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు కదా.. అందులో వింత ఏముందని అనుకుంటున్నారా! వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంలో వింత లేదు. అయితే వచ్చిన భక్తుడు ఒంటి నిండా బంగారంతో రావడమే ఇప్పుడు అందర్నీ ఆకట్టుకుంటుంది. హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి కొండా విజయ్ కుమార్ వంటి నిండా బంగారంతో తిరుమలకు వచ్చాడు. దాదాపు 5 కిలోల బంగారు ఆభరణాలను ధరించి అతను శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న విజయ్‌కుమార్ ధరించిన భారీ ఆభరణాలు.. మిగతా భక్తుల దృష్టిని ఆకర్షించాయి. మెడలో, చేతికి ఉన్న భారీ ఆభరణాలను భక్తులు ఆసక్తిగా పరిశీలించారు. అయితే బంగారంపై తనకు ఆసక్తి ఎక్కువ అని.. అందుకే ఇలా భారీ ఆభరణాలు చేయించుకుని, ధరిస్తున్నానని విజయ్‌కుమార్ తెలిపారు.

# వైజాగ్ సెంట్రల్ జైల్లో కలకలం

### సెల్‌ఫోన్లను పాతిపెట్టిన ఖైదీలు

**విశాఖపట్నం, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** వైజాగ్ సెంట్రల్ జైల్లో మొబైల్ ఫోన్లు దొరకడం ఏపీ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా పెన్నా బ్యారక్ సమీపంలో పోలీసులకు నాలుగు అడుగుల లోతులో పాతిపెట్టిన ఓ ప్యాకెట్ కనిపించింది. పెన్నా బ్యారక్ సమీపంలోని పూల కుండీల వద్ద భూమిలో 4 అడుగుల లోతులో ఈ ఫోన్లను కవర్‌లో పెట్టి పాతిపెట్టారు. వాటిపై రెండు రాళ్లు కప్పి పైన పూల కుండీని పెట్టారు. అనుమానాస్పదంగా కనిపించడంతో దాన్ని పరిశీలించగా అందులో రెండు సెల్‌ఫోన్లు, ఒక పవర్ బ్యాంక్, రెండు చార్జింగ్ వైర్లు, ఫోన్ బ్యాటరీ కనిపించాయి. సెల్‌ఫోన్లు దొరకడంతో పోలీసులు అప్రమత్తమై వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ సెల్‌ఫోన్లలో సిమ్ కార్డులు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఈ విషయం తెలియగానే వైజాగ్ సీపీ శంఖబ్రత బాగ్చీ రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సిమ్ కార్డులు దొరికన పెన్నా బ్యారక్‌లో రౌడీ షీటర్ హేమంత్ కుమార్ ఉన్నట్లుగా తెలుస్తోంది. విశాఖ సెంట్రల్ జైలు వివాదాలపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందించారు. సెంట్రల్ జైల్లో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. వ్యవస్థలు ఏ స్థాయిలో నిర్వీర్యమయ్యా యో అర్థమవుతోందని అన్నారు. జైల్లో గంజాయి, సెల్‌ఫోన్ల ఘటనపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# మాజీ మంత్రి పేర్నినాని సతీమణికి మరోసారి నోటీసులు

**అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** మచిలీపట్నం ప్రైవేట్ గోదాం నుంచి రేషన్ బియ్యం మాయం కేసులో వైసీపీకి చెందిన నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని సతీమణి జయసుధకు పోలీసులు మరోసారి నోటీసులు అందజేశారు. నిన్న రాత్రి పోలీసులు పేర్నినాని ఇంటికి వెళ్లగా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గోడకు నోటీసు అంటించి వెళ్లిపోయారు.బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు బందరులోని ఆర్.పేట పోలీస్‌స్టేషన్‌కు రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఇదే కేసులో పేర్ని జయసుధకు కోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. బెయిల్ మంజూరు సందర్భంగా పోలీసుల విచారణకు సహకరించాలని జడ్జి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని విచారించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిన్న పేర్నినానిపై ఏ- 6 నిందితుడని పోలీసులు తాజాగా కేసు నమోదు చేయగా ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్‌లో పేర్నినాని ముందస్తు పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలించిన కోర్టు ఈ కేసులో నానిపై వచ్చే సోమవారం ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# కార్పొరేషన్ రద్దు దిశగా అడుగులు

## అప్పుల కోసం.. కార్పొరేషన్లు...
## 5 కార్పొరేషన్లు...95 వేల కోట్లు

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** అప్పు చేయడం తప్పు కాదు.. అవసరం ఉన్నప్పుడు చేయాల్సిందే. అవసరాలు తీర్చుకోవాల్సిందే. అంతే బాధ్యతగా తిరిగి చెల్లించాల్సిందే. ఇదే చాణక్యనీతి చెబుతున్న మాట. కానీ తాహతుకు మించి చేసే అప్పులు పెను నష్టాన్ని కలిగిస్తాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఇదే చేసింది. దొరికిన చోటల్లా అప్పులు చేసింది. అభివృద్ధి చేయడానికే అప్పులు చేశామన్న మాట ఆనాడు వినిపించారు. కానీ మార్కెట్లో ఉన్న వడ్డీల కంటే అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడం ఒక తప్పు.అప్పుల కోసమే కార్పొరేషన్లు సృష్టించి ఎడా పెడా బాకీలు తెచ్చింది గత కేసీఆర్ సర్కార్. ఇప్పుడు అవి గుదిబండగా మారాయి. అప్పుల కుప్పగా అయ్యాయి. అందుకే వాటిలో ఏవి ఉండాలో ఏవి ఊడాలో డిసైడ్ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే చేస్తోంది. అప్పుల కుప్పగా మారిన కార్పొరేషన్ల లిస్టు రెడీ చేసింది. ఏవి సొంతంగా రెవెన్యూ జెనరేట్ చేసుకుని లాభాల్లో ఉన్నాయి.. ఏవి నిండా మునిగాయో లిస్టు రెడీ చేసింది. ఆ ప్రకారంగా వాటిని మూసేసేందుకు సిద్ధమవుతోంది. నిజానికి ప్రభుత్వ ఖజానాను ఫుట్ బాల్ మాదిరి ఆడుకోవడం కరెక్ట్ కాదు.రాష్ట్రంలో చాలా కార్పొరేషన్ల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది. సో వాటికి చెక్ పెట్టేలా లిస్ట్ రెడీ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ నిధులు వృథా అవుతూ ఎలాంటి ఉపయోగం లేని వాటికి గుడ్ బై చెప్పబోతోంది. అందులోని ఉద్యోగులను ఇతర సంస్థల్లో విలీనం చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. అటు ఎస్సీఎస్టీబీసీ కార్పొరేషన్లను మరింత బలోపేతం చేయడం, రెవెన్యూ ఎక్కువ జెనరేట్ చేస్తున్న వాటికి మరింతగా బూస్టప్ ఇచ్చేలా రేవంత్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.తెలంగాణలో ప్రస్తుతం 90కి పైగా కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో ఐదారు తప్ప మిగతా కార్పొరేషన్లకు ఎలాంటి ఇన్ కమ్ లేదు. కేవలం నామ్ కే వాస్తేగా నడుస్తున్నాయి. ఇందులోనూ ఎక్కువ కార్పొరేషన్లు రాజకీయ నిరుద్యోగుల పదవుల భర్తీ కోసం, ప్రభుత్వానికి అప్పులు తెచ్చి పెట్టేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి. సో ఓవరాల్ గా చూస్తే కార్పొరేషన్ల ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పులు 2 లక్షల 82వేల 84 కోట్లుగా ఉంది. ఇది మొత్తం తెలంగాణ రాష్ట్ర అప్పులో 42 శాతంగా ఉందంటే ఏ స్థాయి కుప్ప జమైందో అర్థం చేసుకోవచ్చు.ఇందులో ప్రభుత్వం హామీ ఇచ్చి, తీర్చాల్సిన అప్పులు ఒక లక్షా 27 వేల 208 కోట్లుగా ఉంది. అలాగే గత ప్రభుత్వ షూరిటీలతో అప్పులు తీసుకుని, వాటిని తీర్చే బాధ్యత కార్పొరేషన్ల మీద ఉన్నవి 95 వేల 462 కోట్ల రూపాయలు. అంతే కాదు ఇవన్నీ చాలవన్నట్లుగా కార్పొరేషన్లు సొంతంగా బాకీలు చేసి, తామే తీర్చే అప్పులు 59వేల 414 కోట్లుగా ఉంది. అయితే ఈ కార్పొరేషన్లకు ఇన్ కమ్ లేక వీటి అప్పులను కూడా సర్కారీ ఖజానా నుంచే చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది.ఉన్న కార్పొరేషన్లలో 90 శాతం కార్పొరేషన్లు అప్పుల ఊబిలోనే ఉన్నాయి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా అప్పుల విషయంలో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రస్తుత ప్రభుత్వానికి తలకుమించిన భారంగా మారింది. అందుకే వాటిని సెట్ రైట్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ రెడీ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇది ప్రజల భారాన్ని తగ్గించడం కోసమే. ప్రజల సంక్షేమం బాగుండాలంటే ముందుకు అధిక మిత్తీలకు తెచ్చిన అప్పుల్ని క్లియర్ చేసేయాల్సిన పరిస్థితి ఉంది.ప్రజా ధనాన్ని పకడ్బందీగా వాడాలి. ఎక్కడా రూపాయి వేస్ట్ కావొద్దన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. వాటిని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలన్న కాన్సెప్ట్ తో రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే గుదిబండగా ఉన్న లోన్ల రీస్ట్రక్చరింగ్ పై నజర్ పెట్టింది. అధిక వడ్డీలకు తెచ్చిన లోన్లపై టాప్ అప్ ల జోలికి వెళ్లడం లేదు. ఇంటి కోసం హోమ్ లోన్ తీసుకునే వారిలో కొందరు టైమ్ కంటే ముందుగానే తమ చేతికి డబ్బు అందినప్పుడల్లా ప్రిన్సిపుల్ అమౌంట్ కడుతుంటారు. లోన్ త్వరగా క్లియర్ చేసుకునే పనిలో ఉంటారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా అదే పని చేస్తోంది.తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ, టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్, బేవరేజెస్ కార్పొరేషన్, జెన్‌కో, ట్రాన్స్‌కో, సివిల్ సప్లయ్స్, ఫారెస్ట్ డెవలప్ మెంట్, మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్లు, సింగరేణి వంటివి తమంతట తాము సెట్ చేసుకునే పరిస్థితిలో ఉన్నాయి. అంటే వాటికి వివిధ మార్గాల ద్వారా వచ్చే నిధులను జీతాలు, నిర్వహణ ఖర్చుల కోసం వాడుకుంటున్నాయి. ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితిలో లేవు.నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి చూపాల్సిన సెట్విన్ అనే కార్పొరేషన్ పూర్తిగా ఉనికి కోల్పోయింది. ఫిల్మ్ అండ్ టెలివిజన్, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ తో పాటు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసి రైతులకు అందించే ఆగ్రోస్ వంటివి నిధుల్లేక ఖాళీగా చేతులెత్తేసి రెడీగా ఉన్నాయి. ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, హాకా వంటి సంస్థలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోంది. వీటితో పాటే స్టేట్ హ్యాండి క్రాఫ్ట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్, విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, మేదర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్,ట్యాడీ టాపర్స్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్..మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, వుమెన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, వికలాంగుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ యోగాధ్యయన పరిషత్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, లెదర్ ఇండస్ట్రీస్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్, ఆగ్రోస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, టెక్స్‌టైల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్, సెట్విన్, ట్రైకార్, తెలంగాణ ఫుడ్స్ వంటివి ఉన్నాయి. ఇలాంటి సంస్థలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని అనుకుంటోంది. ఏం చేస్తే ఇవి ఉపయోగపడుతాయి? ఎలా చేయాలన్నది ఫైనల్ కాల్ తీసుకోబోతున్నారుఅసలు ఆదాయమే లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నుంచి ఎక్కువ వడ్డీతో అప్పులు తీసుకుంది గత సర్కారు. మొత్తం కార్పొరేషన్ల అప్పులు ఒక ఎత్తు అయితే? ఐదు కార్పొరేషన్లవే ఏకంగా 95 శాతం బాకీలున్నాయి. అందులో నెంబర్ వన్ లాస్ కంపెనీ కాళేశ్వరం కార్పొరేషన్. ఆ తర్వాత డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్, వాటర్ రీసోర్స్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, గొర్రెల కార్పొరేషన్ వంటివి ఉన్నాయి.ఇవే 95 శాతం అప్పులు తెచ్చుకున్నాయి. తెస్తే తెచ్చాయి.. కానీ మార్కెట్ లో ఒక వడ్డీ రేటు ఉంటే అంతకంటే ఎక్కువ పెట్టి తేవడంలో లాజిక్స్ ఏంటన్నది తేల్చే పనిలో ఉన్నారు. మార్కెట్ లో ఇంట్రెస్ట్ రేట్ యావరేజ్ గా 7.63 శాతంగా ఉంది. కానీ ఏకంగా 10.49% వడ్డీతో లోన్లు తెచ్చింది గత సర్కార్. ఇలా ఎవరైనా చేస్తారా? ఇది ఎంత గుదిబండో అర్థం చేసుకోలేకపోయారా? ఓన్లీ అడిగినంత అప్పులు ఇస్తే చాలు అనుకున్నారా?కాళేశ్వరం కార్పొరేషన్ పై 9.69% ఇంట్రెస్ట్ రేటుతో 74 వేల 599 కోట్ల రూపాయలు అప్పు చేశారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్ పై 9.48% వడ్డీ రేటుతో 20,200 కోట్లు అప్పులు చేశారు. వాటర్ రీసోర్స్ కార్పొరేషన్ పై అత్యధికంగా 10.49% ఇంట్రెస్ట్ తో 14 వేల 60 కోట్ల రూపాయలు బాకీలు తెచ్చారు. ఇది ప్రభుత్వ ఖజానాపై ఎంతలా భారం మోపుతోందో ప్రస్తుత ప్రభుత్వానికి అర్థమవుతోంది. ఇక హౌసింగ్ కార్పొరేషన్ పై 9 వేల కోట్లు, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ పై 2,951 కోట్ల రుణాలు ఉన్నాయి.గొర్రెల కార్పొరేషన్ కింద గత ప్రభుత్వం గొర్రెల స్కీం కోసం 4 వేల కోట్లు, చేపల కోసం మరో 600 కోట్ల అప్పు చేసింది. ఇక హాస్పిటల్స్ నిర్మాణాల కోసం కూడా 3,535 కోట్లు కార్పొరేషన్ల కిందనే బాకీలు తీసుకుంది. అయితే ఇందులో హౌసింగ్ వంటి వాటికి కచ్చితంగా రుణాలు తీసుకోవాల్సినవే. అయితే ఎక్కువ వడ్డీ రేట్లకు బాకీలు తేవడమే ఇప్పుడు ఖజానాను ఖతం చేస్తోంది. తెలంగాణలో కార్పొరేషన్లు ఎలా అప్పుల ఊబిలో ఉన్నాయో చూశాం కదా. వీటితో రోజులు గడిచేకొద్దీ నష్టాలే తప్ప లాభాలు ఉండవు. అందుకే కార్పొరేషన్లను సెట్ చేయడం, లోన్లను రీస్ట్రక్చర్ చేయడం, సాధ్యమైనంత వరకు అసలు, బాకీలు తీర్చుకుంటూ వెళ్లడమే రేవంత్ సర్కార్ టార్గెట్ గా పెట్టుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ అధిక వడ్డీలకు కేసీఆర్ తెచ్చిన ఈ లోన్ల రీ స్ట్రక్చరింగ్ పై రిక్వెస్టులు చేస్తూ వస్తున్నారు. కొంత వరకు సక్సెస్ అయ్యారు కూడా. ఓవైపు గత ప్రభుత్వం సృష్టించిన అప్పుల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తుంటే విపక్షం మాత్రం ఇప్పటి ప్రభుత్వమే అప్పుల మీద అప్పులు చేస్తోందని విమర్శలు చేయడమే విడ్డూరం.

కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలందరు మంచి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని, నాయకులను ఉద్దేశించి మాధవరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తక్కల్లపల్లి రవీందర్రావు, మున్సిపాలి ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు ఓర్సు తిరుపతి, కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్, ములకల వినోద సాంబయ్య, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల రమేష్, పొన్నం నరసింహారెడ్డి, దండెం రతన్ కుమార్, ముల్కల మనీష్, ఐఎన్టి యుసి అధ్యక్షులు కంచు రవి, ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ కటారి ఉత్తమ్ కుమార్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 16మంది టీచర్లపై వేటు




హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: యాదాద్రి భువనగిరి జిల్లాలో దీర్ఘకాలికంగా విధులకు డుమ్మా కొడుతున్న 16 మంది టీచర్లపై వేటు పడింది. వారిని సర్వీస్ నుంచి తొలగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే అన్ని సదుపాయాలు పొందుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ గీతారాణి, ఎస్జీటీలు విజయలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, ఉమారాణి, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, స్వప్న, మాధవి, నవీన్ కుమార్, ఎం.ఉమాదేవి, క్రాంతి కిరణ్, జె.ఉమాదేవి, నర్సింహారావు, శైలజ, భాగ్యలక్ష్మి, కిరణ్‌కుమారి 2005 నుంచి 2022 వరకు అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయం విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో.. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవ్వడంపై వివరణ ఇవ్వాలని సదరు ఉపాధ్యాయులను నోటీసులు ఇచ్చింది. అయినప్పటికీ స్పందించలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి 16 మంది ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగించారు. ఈ విషయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ తెలిపారు. యాదాద్రి జిల్లాలో 16 మంది ప్రభుత్వ టీచర్లను విధుల్లో నుంచి తొలగించారు. వీరు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరు కావడంతో డీఈవో ఇటీవల నోటీసులిచ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: కొత్త సంవత్సరం వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. చిన్నా, పెద్దా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో భాగస్వాములై.. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. ఇక న్యూ ఇయర్ సంబురాలు ముగియడంతో.. బుధవారం ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాలకు భక్తులు తరలి వెళుతున్నారు. నూతన సంవత్సరం రోజున తమ ఇష్ట దైవాన్ని దర్శించుకుని, అంతా శుభం జరగాలని భక్తులు కోరుకుంటున్నారు. ఇక భక్తుల తాకిడిని ముందే ఊహించిన ఆలయాల అధికారులు.. వారి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ, జోగులాంబతో పాటు ఇతర ఆలయాలకు భక్తులు బారులు తీరారు. దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. హైదరాబాద్ నగరంలోని చిలుకూరు బాలజీ టెంపుల్, బిర్లా మందిర్, పెద్దమ్మ తల్లి ఆలయం, జూబ్లీహిల్స్, హిమాయత్ నగర్‌లోని టీటీడీ ఆలయాలు, పద్మారావు నగర్‌లోని స్కంధగిరి టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### మృతి చెందిన భార్యాభర్తలు

జగిత్యాల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: ధర్మపురి పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు దంపతులను వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భర్త అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులను రామయ్యపల్లె గ్రామానికి చెందిన కూస చంద్రయ్య(60), కూస భాగ్యమ్మ(55)గా పోలీసులు గుర్తించారు. న్యూ ఇయర్ సందర్భంగా రాత్రి ధర్మపురి చర్చిలో ప్రార్థనల నిమిత్తం దంపతులిద్దరూ వెళ్లారు. ప్రార్థనల అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై వారి బైక్‌ను కారు ఢీకొట్టింది. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రణాళికలను అమలు చేయబోతున్నారు. గోదావరి జలాలను బనకచర్లకు తరలించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో పది సూత్రాల్లో నీటి భద్రతకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవరకూ సీమకు నీళ్లివ్వాలనే ఆలోచన ఎవరూ చేయలేదు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో ఒక ఒప్పందం జరిగిందని, ఆ సందర్భంలో శ్రీశైలం నుంచి తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా తమిళనాడుకు కెనాల్ నీరివ్వడానికి తాను సిద్ధంగా ఉన్నామని అన్నారని గుర్తు చేశారు. తెలుగుగంగ ద్వారా రాయలసీమ, తమిళనాడుకు నీరిచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ, ఏపీలో ఉన్న 90 శాతం ప్రాజెక్టులు ప్రారంభించి పూర్తిచేసిన ఘనత టీడీపీది. గండికోట, కండలేరు, సోమశిల ఇలా అనేక ప్రాజెక్టులు నిర్మించాం. 2014 రాష్ట్ర విభజన సమయంలో నాటి కేంద్ర ప్రభుత్వం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. తెలంగాణలోని 7 మండలాలను ఏపీకి ఇస్తేనే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తానని ప్రధాని మోదీకి చెప్పగా 7 మండలాలను ఏపీలో కలుపుతూ ఆర్డినెన్స్ తెచ్చారు. నీటి విషయంలో ఎన్టీఆర్ ముందుచూపుతో ఆలోచన చేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు పునాదిరాయి వేశాను. ఉత్తరాంధ్రలో తోటపల్లి ప్రారంభించి పూర్తిచేశానన్నారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 3 వేల టీఎంసీల నీటిలో 300 టీఎంసీల నీటిని ఒడిసిపట్టడమే ఈ ప్రాజెక్టు చేపట్టడం వెనుక ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రాజెక్టు పూర్తైతే 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుంది. మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. పోలవరం నుంచి కృష్ణా నదికి నీరు మళ్లించడం మొదటి దశ కాగా, రెండో దశలో బొల్లాపల్లి జలాశయం నిర్మించి నీళ్లు తరలిస్తామన్నారు. మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్లకు నీటిని మళ్లిస్తాము. గోదావరి నీటిని కృష్ణా నదికి దాని నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు తరలిస్తాము. ఈ ప్రాజెక్టు పూర్తైతే రాయలసీమ రతనాలసీమగా మారుతుంది. పెన్నా నది ద్వారా నెల్లూరుకు నీరు ఇవ్వొచ్చు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రకాశం జిల్లాలో కరవును అరికట్టవచ్చన్నారు. వర్షపాతం ఎక్కువగా ఉన్నా నీటి కొరత ఉందని రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కరవు వల్ల సాగు దెబ్బతింది. సకాలంలో నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమను రతనాలసీమగా మార్చవచ్చు. గతంలో అనంతపురంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉండేది. మా ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడంతో తలసరి ఆదాయం 4-5 శాతానికి చేరింది. పట్టిసీమ రాకతో సకాలంలో పంట చేతికి అందుతోంది. 1970లో 371 టీఎంసీల నీరు 1994లో 5,959 టీఎంసీ నీరు 2024లో 4,114 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయిందని వివరించారు. ఈ 50 ఏళ్లలో సగటున యేడాదికి 3 వేల టీఎంసీల నీరు గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్తోంది. ఈసారి వరుణుడు కరుణించడం, ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతగా పనిచేయడంలో రాష్ట్రంలోని అన్ని



రిజర్వాయర్లలో కలిపి 983 టీఎంసీలు నీటి నిల్వ ఉందని ప్రస్తుతం రిజర్వాయర్ల నీటి సామర్థ్యం 729 టీఎంసీలుగా ఉందన్నారు. నదుల అనుసంధానం చేసి ఎక్కడికక్కడ రిజర్వాయర్లు కడితే రాష్ట్రంలో నీటి సమస్య అనేదే ఉండదన్నారు. డెల్టాకు ... రాయలసీమకు: రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు గోదావరి నీటిని బనకచర్ల కు తరలించడమే మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. అందులో భాగంగా గోదావరి వరద జలాలను తరలించడం ద్వారా రాష్ట్రానికి జలహారం కింద అన్ని ప్రాంతాల నీటి అవసరాలు తీర్చనున్నారు. పోలవరంతో పాటు కొత్త ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చే అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం ఏర్పడ్డాక 6 నెలలుగా దీనిపై విస్తృత కసరత్తు చేస్తున్న ప్రభుత్వం...ప్రాజెక్టును కార్యరూపం ఇచ్చే విషయంలో కీలక అడుగులు వేస్తోంది. ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా విస్తృత స్థాయిలో రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, పరిశ్రమలకు మేలు జరగబోతోంది. ప్రాజెక్టు పూర్తి అయితే 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందుతుంది. దీనితో పాటు 22.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. పరిశ్రమలకు దాదాపు 20 టిఎంసిల నీటిని వినియోగించవచ్చు. ఎగువన ఉన్న ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నదికి తగిన విధంగా నీటి ప్రవాహాలు రావడం లేదు. మరో వైపు గోదావరి నదిలో ప్రతి ఏడాది వేల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తోంది. ఈ నీటిలో కనీసం 280 టిఎంసిల నీటిని వరద సమయంలో వినియోగించుకోవాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. దీని కోసం రెండు మూడు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొదట గోదావరి నీటిని కృష్ణా నదికి తరలిస్తారు. కృష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. 200 టిఎంసిల సమర్థ్యంతో బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మిస్తారు. అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటికి తరలిస్తారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు 31 కి.మీ టన్నెల్ ద్వారా నీటిని తరలిస్తారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ, గాలేరు, నిప్పుల వాగుకు నీళ్ళు వెళుతుంటాయి. నిప్పుల వాగు ద్వారా సోమశిల, కండలేరుకు నీటిని తరలిస్తారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని వివిధ లిఫ్టులు, కాలువల ద్వారా అన్ని ప్రాజెక్టులకు తరలిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే ఎంత దుర్భర పరిస్థితులున్నా సీమ జిల్లాలకు, పెన్నా ద్వారా నెల్లూరుకు నీరు ఇవ్వొచ్చు. ఈ ప్రాజెక్టు ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా సాగయ్యే పంటలకు కూడా సమృద్ధిగా నీటిని అందజేయవచ్చు. అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కరువు ప్రాంతంగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టు నీటి అసవరాలను కూడా తీర్చుతుంది. గోదావరిలో వరద సమయంలో 280 టిఎంసిల నీటిని సీమకు తరలిస్తారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ నుంచి రోజుకు మూడు టిఎంసి నీటిని తరలిస్తారు. ఒక టిఎంసి నీళ్లు కృష్ణా డెల్టాకు ఇస్తారు. అంటే 280లో కనీసం 80 టిఎంసిల నీరు కృష్ణా డెల్టాకు కేటాయిస్తారు. ఈ స్థాయిలో నీటిని గోదావరి నుంచి తరలించాలంటే పోలవరం కుడికాలువ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంటుంది. పోలవరం కుడికాలువను 17 వేల క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 28 వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచుతారు. అదే విధంగా తాడిపూడి లిఫ్ట్ స్కీమ్ కాలువ సామర్థ్యాన్ని కూడా 1500 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు పెంచి నీటిని తరలిస్తారు. కేవలం గోదావరి కి వరదల సమయంలోనే నీటిని తీసుకోవడం ద్వారా....సముద్రంలో వృధాగా పోయే నీటిని మాత్రమే తీసుకోవడం ద్వారా గోదావరి డెల్టాకు ఈ కొత్త ప్రాజెక్టు వల్ల నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ ప్రాజెక్టు చేపట్టడం అంత సులభం కాదు. అయితే ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఇదే పెద్ద గేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.70 వేల నుంచి రూ.80 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలుస్తోంది. 54 వేల ఎకరాల భూ సేకరణ జరపాల్సి ఉంటుంది. 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. పెద్ద మొత్తంలో ఫారెస్టు భూములు కూడా సేకరించాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే భారీ వ్యయం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వ్యయం చేసే అవకాశం లేదు. దీంతో ఈ ప్రాజెక్టు అవసరాన్ని, ప్రయోజనాలను కేంద్రానికి వివరించిన ముఖ్యమంత్రి కేంద్ర సాయం కూడా తీసుకుని దీన్ని పూర్తి చెయ్యాలని భావిస్తున్నారు. ఈ వారంలో జరిగిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర పెద్దలతో ఈ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రాజెక్టు అవసరాన్ని వివరించి ఆర్థిక సాయం పై విన్నవించారు. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టుకు అనుమతులు పొంది, టెండర్ల ప్రక్రియ పూర్తి చెయ్యాలని సిఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రజల అవసరాల దృష్ట్యా అత్యంత వేగంగా, ప్రాధాన్యంతో ఈ ప్రాజెక్టు పూర్తి చెయ్యాలని భావిస్తున్నామని...అందులో భాగంగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని పనులు వేగంగా జరగాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ తో పాటు ఇతర ఇరిగేషన్ శాఖ అధికారులు, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.

# పవన్ వన్ సైడ్ అవుతున్నారా..

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నారు. ఆయన ఏపీలో కూటమి ఏర్పాటు కావడానికి ప్రధాన కారణం. ఒకరకంగా బీజేపీ, టీడీపీని ఒక వేదికపైకి చేర్చడానికి పవన్ కల్యాణ్ ముఖ్య కారణం. పవన్ కల్యాణ్ వల్లనే ఆంధ్రప్రదేశ్ లో కూటమి విజయం సాధించింది. మరోవైపు నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలతో సత్సంబంధాలతో పాటు సాన్నిహిత్యం కూడా ఉంది. అలాగే పవన్ కల్యాణ్ అన్నా కూడా ఢిల్లీ పెద్దలకు ప్రేమ, గౌరవం కూడా. పవన్ కల్యాణ్ ను రాజకీయంగా ఎలా ఉపయోగించుకోవాలో కేంద్ర నాయకత్వం కూడా ఆలోచిస్తుంది. అదే సమయంలో దక్షిణ భారత దేశంలో క్రౌడ్ పుల్లర్ గా కూడా పవన్ కల్యాణ్ ను సెంట్రల్ పార్టీ గుర్తిస్తుంది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం కాంగ్రెస్ ముఖ్యమంత్రిని వెనకేసుకు రావడం, పొగడ్తలతో ముంచెత్తడం, ప్రశంసలను కురిపించడం ఇప్పుడు ఏపీలోనే కాదు ముఖ్యంగా తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. సంధ్య థియేటర్ లో జరిగిన ఘటనపై పవన్ కల్యాణ్ తొలిసారి మీడియా ముందు స్పందించారు. అయితే ఈ సమావేశలో రేవంత్ రెడ్డి తప్పేమీ లేదన్నట్లు ఆయన అన్నారు. రేవంత్ స్థానంలో ఎవరున్నా అదే చేసేవారని, రేవంత్ సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కూడా కొనియాడరు. ఈ ఘటనలో పుష్ప టీం తప్పేనంటూ పవన్ కల్యాణ్ తెగేసి చెప్పారు. అంతేకాదు ఒకరకంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వెనకేసుకు వచ్చారు. అయితే దీనిపై బీజేపీ నేతలు మాత్రం ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తుంది. ముందస్తు బెయిల్ కు యత్నం బీజేపీ నేతలు మాత్రం... పుష్ప ఘటన తర్వాత జరిగిన పరిణామాలపై ఇటు ఏపీ బీజేపీలోని నేతలు, అటు తెలంగాణ బీజేపీ యావత్తూ అల్లు అర్జున్ వైపు నిలబడింది. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా అనేక స్టేట్ మెంట్లు ఇచ్చారు. కేంద్ర



మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు అల్లు అర్జున్ ను వెనకేసుకు వచ్చారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి సయితం కూడా అల్లు అర్జున్ తప్పేమీ లేదని ప్రకటన చేశారు. కానీ ఇందుకు విరుద్ధంగా కూట మిలో ఉన్న పవన్ కల్యాణ్ మాత్రం తప్పు అల్లు అర్జున్ టీందేనని తేల్చి చెప్పడంతో రేవంత్ కు మరింతగా క్రేజ్ పెరిగిందంటున్నారు. ఇప్పటి వరకూ మెగా ఫ్యాన్స్, బన్నీ ఫ్యాన్స్ లో ఒకింత వ్యతిరేకత ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ స్టేట్ మెంట్ తో కొంత మైలేజీ పెరిగిందన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. సున్నితమైన అంశంపై... మిత్రపక్షంగా ఉన్నప్పుడు ఒక సున్నితమైన అంశంపై మౌనంగానైనా ఉండాలి. లేదంటే మిత్రపక్షంలోని పార్టీలకు అనుగుణంగా వ్యవహరించాలి. అంతే తప్ప అందుకు విరుద్ధంగా ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రిపై ప్రశంసలు కురిపించడం ఏంటన్న ప్రశ్నలు ఇప్పుడు కమలనాథుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అయితే పవన్ కల్యాణ్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడే రకం కావడంతో ఆయన తన మనసులో ఉన్నది ఆఫ్ ది రికార్డులో చెప్పారని, అంటే చిట్ చాట్ లోనే ఆయన ఈ రకంగా స్పందించా రని, బహిరంగ వేదికలపై ఎక్కడా ఈ విషయంపై రెస్పాన్స్ కాలేదన్న విషయాన్ని కూడా జనసేన నేతలు గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద మిత్ర పక్షంగా ఉన్న పవన్ కల్యాణ్ కాంగ్రెస్ నేతలకు వత్తాసు పలకడంపై ప్రధానంగా తెలంగాణ బీజేపీ నేతలు గుర్రుగానే ఉన్నారు.

## ప్యూర్టో రికోలో కుప్పకూలిన పవర్ గ్రిడ్.. అంధకారంలో ప్రజలు



శాన్ జువాన్ : ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు జరుగుతున్న సమయంలో కరేబియన్ ద్వీపమైన ప్యూర్టో రికాలో చీకట్లు కమ్ముకున్నాయి. భారీ పవర్ గ్రిడ్ కుప్పకూలిందని ద్వీపదేశంలో విద్యుత్ పంపిణీని పర్యవేక్షిస్తున్న ప్రైవేట్ కంపెనీ లూమా ఎనర్జీ తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 1.3 మిలియన్లకు పైగా జనాభాకు విద్యుత్ లేదని, సుమారు 90 శాతం మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక మీడియా వెల్లడించింది. విద్యుత్‌ను పునరుద్ధరించడానికి రెండు రోజుల సమయం పట్టవచ్చని లూమా ఎనర్జీ తెలిపింది. పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని పేర్కొంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఈ సమస్య ఎదురైందని తెలిపింది. అయితే గ్రిడ్ కుప్పకూలడానికి గల కారణాలను అధికారులు వెల్లడించలేదు. 2017లో నాలుగో కేటగిరీ తుపాన్ అయిన మారియా హరికేన్‌తో పవర్‌గ్రిడ్ తీవ్రంగా ధ్వంసమైంది. మరోవైపు నిర్వహణ , పెట్టుబడులు లేకపోవడంతో వ్యవస్థ మరింత క్షీణించింది.

ఇచ్చింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుంది. ఇప్పటి వరకూ ఆరు గ్యారంటీలలో ఎన్ని అమలయ్యాయి? దానిపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై చర్చ జరుగుతుంది. ఆరు గ్యారంటీలతోనే కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ముక్తకంఠంతో నేతలందరూ చెప్పడంతో జనం కూడా నమ్మారు. కానీ అందులో కొన్నింటిని ప్రమాణస్వీకారం చేసిన రెండు రోజుల్లోనే అమలు చేయడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వేగంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అందరూ భావించారు.డిసెంబరు 7వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తే తొమ్మిదో తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం సూపర్ సక్సెస్ అయింది. ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేటు పెరగడమే కాకుండా అదనపు ఆదాయాన్ని కూడా తెచ్చిపెట్టిందంటున్నారు. అత్యంత వేగంగా ఈ పథకాన్ని గ్రౌండ్ చేయడంతో ఇక ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయని అందరూ భావించారు. కానీ తర్వాత హామీల అమలులో కొంత ఆలస్యం జరిగింది. రెండు వందల యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తుకు పెద్దగా రెస్పాన్స్ రావడం లేదంటున్నారు. ఎందుకంటే చాలా

సమాచారాన్ని బట్టి ఈ పథకం కింద కూడా అందరికీ అందేది లేదన్నది అర్థం అవుతుంది. కొందరికిపెట్టి మరికొందరికి గతంలో వచ్చేసొమ్ములు రాకుంటే వారంతా వ్యతిరేకమయ్యే అవకాశముందన్న ఆందోళనవ్యక్తమవు తుంది. అదే ఇప్పుడు కాంగ్రెస్ నేతల్లో టెన్షన్ ప్రారంభమయింది. పథకాలను అమలు చేస్తున్నారు సరే.. అందరికీ కాకుండా కొందరికే అందడంపై పార్టీలోనే కొంత అసంతృప్తులు వినపడుతున్నాయి. 01. మహాలక్ష్మి పథకం, ఐదు వందలకే వంట గ్యాస్ సిలిండర్ – అమలు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం – అమలు చేశారు. మహిళలకు నెలకు రెండు వేలు – అమలు కాలేదు. 02. రైతుల కోసం, వరి రైతులకు ఐదు వందల బోనస్ – అమలు చేశారు. రెండు లక్షల రుణ మాఫీ – అమలు చేశారు. రైతు భరోసా – సంక్రాంతికి అమలు, 03. గృహజ్యోతి. ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్లు విద్యుత్తు ఉచితం – అమలు చేశారు. 04. పేదల కోసం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం –సంక్రాంతి నుంచి అమలు. 05. యువ వికాసం, ఐదు లక్షల విద్యాభరోసా కార్డు – అమలు చేయాలి. 06. వృద్ధుల కోసం, పింఛనును నాలుగు వేలకు పెంపు – అమలు చేయాలి

శాఖలపై అధ్యయనం చేశారు. కొంతకాలం అధికారులతో సమీక్షలకే పరిమితమయిన పవన్ కల్యాణ్ ఇప్పుడు క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఇక అనేక కేంద్ర ప్రథకాలను రాష్ట్రానికి తీసుకురావడం వెనక కూడా ఐఏఎస్ అధికారి కృష్ణతేజ సూచనలు ఉన్నాయంటున్నారు. కృష్ణతేజ ఈ పథకం కింద నిధులు తేవచ్చుని పవన్ కల్యాణ్ కు చెప్పడం, దాని వల్ల ఎంత నిధులు వస్తాయి? ఏ మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయవచ్చు? ఏ ఏ ప్రాంతాల్లో వాటిని ఖర్చు పెట్టాలి? నిబంధనలు ఏంటి? వంటి వాటిపై పవన్ కు బ్రీఫింగ్ ఇవ్వడంతో పవన్ కల్యాణ్ వెంటనే కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధులను తెప్పిస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో నిధులు, సర్పంచ్ లకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంతో పాటు గ్రామసభలను ఏర్పాటు చేసి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆ పనులను చేపట్టడం వంటివి చేస్తూ నిజంగానే పల్లె పండుగ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక మారుమూల ప్రాంతాలకు రహదారుల సౌకర్యం లేకపోవడం, డోలీలతో రోగులను తీసుకెళ్లడం కొన్ని దశాబ్దాల నుంచి చూస్తునే ఉన్నాం. అయితే ప్రభుత్వాలు మారినా ఆ ప్రాంతాలకు రహదారుల నిర్మాణం జరగలేదు. అస్సలు దానిపై ఎవరూ దృష్టి కూడా

నిర్మాణం జరగాల్సిందేనంటూ పట్టుబట్టి నిధులను కేటాయించారు. ఇప్పటికే కొన్ని గ్రామాలకు రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.భవిష్యత్ లోనూ నిధులను ఏజెన్సీలో రహదారుల నిర్మాణం కోసం పవన్ వెచ్చించే అవకాశముంది.పవన్ కల్యాణ్ కు ఒక వెసులు బాటు ఉంది. ఇతర మంత్రుల్లాగా ఆయన నిధుల కోసమో... మరెవరి ఆదేశాల కోసమో ఎదురు చూడాల్సిన పనిలేదు. ఆయనకు ఏది మంచి అనిపిస్తే అది చేయడానికి అనువైన వాతావరణం ఉంది. ఆయన మాటను, ఆదేశాలను ఎవరూ కాదన లేని పరిస్థితి ఏపీలో ప్రస్తుత రాజకీయాల్లో ఉంది. అందుకే ఆయన ఫ్రీగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనికి తోడు కృష్ణ తేజ వంటి మంచి అధికారి పక్కన ఉండటంతో ఇక ఆయనకు ఎదురులేకుండా పోతుంది. రాజకీయాల్లోకి వచ్చిన పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన జనసేనను నిజంగా జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఈ యువ ఐఏఎస్ అధికారి సూచనలను పవన్ ను కరెక్ట్ డైరెక్షన్ లోనే పనిచేస్తున్నాయి. ఇటీవల కడప వెళ్లి వైసీపీ నేతల దాడిలో గాయపడిన ఎంపీడీవో జవహర్ ను పరామర్శించడం కూడా పవన్ కల్యాణ్ రాజకీయ పరిణితి ప్రదర్శించారంటున్నారు. సో.. డైరెక్షన్ కృష్ణతేజ అని జనసేనలో అందరూ చెబుతున్న విషయం.

# అదానీ సంస్థతో విద్యుత్ ఒప్పందం రద్దు




**చెన్నై, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** అదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఇటీవల అమెరికా పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఎఇఎస్ఎల్)తో స్మార్ట్ మీటర్ల సేకరణ కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ( టిఎన్‌జిఇడిసిఒ) చేసుకున్న ఒప్పందాన్ని స్టాలిన్ ప్రభుత్వం రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక ధరలను కోట్ చేశారని, అందుకే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఆగస్టులో నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాలను కవర్ చేసే టెండర్‌లో ప్యాకేజీ 1కి కి అదానీ సంస్థ 82 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లను పంపిణీ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అదానీ సంస్థ కోట్ చేసిన ధర అధికంగా ఉన్నందున డిసెంబర్ 27, 2024న టెండర్‌ను రద్దు చేసినట్లు వెల్లడించాయి. మరో మూడు ప్యాకేజీల టెండర్లను కూడా రద్దు చేశామని తెలిపింది. మరోసారి టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. 2020–2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అదానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటి చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేసినట్లు అమెరికా పత్రిక ఫైనాన్సియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయటపడింది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ప్రతివాదుల జాబితాలో చేర్చారు.

## వైకాపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

**విశాఖపట్నం:** విశాఖ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి గుడి వాడ అమర్నాథ్ 2025 నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా భారీ కేకును కట్ చేసి పార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజల జీవితంలో వెలుగులు నిండాలని జిల్లా అధ్యక్షు డు అమర్ ఆకాంక్షించారు.గత ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ లను అమలు చేసేల వైసీపీ ప్రభు త్వంపై ఒత్తిడి తీసుకొస్తుందని తెలిపారు.

# మళ్లా సేమ్ ఫీడ్ బ్యాక్...

**విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్నది ఫీడ్ బ్యాక్ ను తెప్పించుకోవడం తొలి నుంచి అలవాటు. 1995లో ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలో ఈ ఫీడ్ బ్యాక్ ను పార్టీ కార్యకర్తల నుంచి కాకుండా ఐఏఎస్ అధికారుల నుంచి తెప్పించుకునేవారు. దీంతో పాటు ఇంటలిజెన్స్ నివేదికలు ఎలాగూ వచ్చేవి. తన గురించి,తన ప్రభుత్వ పాలన గురించి జనం ఏమనుకుంటున్నారో తెలుసుకోవడానికి ఆయన చేసిన ప్రయత్నమిది. ఒరకంగా ఇలా తెలుసుకోవాలనుకోవడం మంచిదే. ఎందుకంటే జనాభిప్రాయాన్ని బట్టి ఏ రాజకీయ పార్టీ మనుగడ అయినా కొనసాగుతంది. అందుకే ఫీడ్ బ్యాక్ అనేది అత్యంత ముఖ్యమైన విషయం. ఒకరకంగా ఫీడ్ బ్యాక్ తీసుకోవడమనేది చంద్రబాబు నుంచే మొదలు అనుకోవాలి. అయితే ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో జనం మనసులో ఉన్న మాటలను సరిగా చంద్రబాబుకు చేరవేసేవారు కారు. దీంతో వచ్చే ఫీడ్ బ్యాక్ లో నిజాలు కేవలం ముప్ఫయి శాతం మాత్రమే ఉండేవన్నది కాదనలేని వాస్తవం. ఎందుకంటే తమ లోపాలు బయటపడతాయని జనం వాయిస్ ను చంద్రబాబుకు ఐఏఎస్ లు చేర్చరు. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఇటు ఐఏఎస్ లను, ఐపీఎస్ లను ఏ నేతా నమ్ముకోవడం లేదు. అందులో చంద్రబాబు కూడా ఒకరు. అలాగే పార్టీ కార్యకర్తలను కూడా విశ్వసించడం లేదు. కానీ అందుకోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నిధులు గుమ్మరించి మరీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై జనం నాడిని తెలుసుకుంటారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఐ ప్యాక్ టీంతో నివేదికలు తెప్పించుకునే వారు. కానీ మొన్నటి ఎన్నికలలో దారుణంగా ఓటమిపాలయ్యారు.ప్పుడు చంద్రబాబు కూడా రాబిన్ శర్మ నేతృత్వంలో ఒక బృందానికి ఈ బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. పాలనలో సమస్యలు, పథకాల అమలులో లోటుపాట్లు, వాటికి పరిష్కారాలపై అధ్యయనం చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతోందో నేరుగా ముఖ్యమంత్రికి నివేదించడం ఈ బృందం చేసే ముఖ్యమైన పని. ఈ బృందానికి 'చీఫ్ మినిస్టర్ ఫెలోస్' అని పేరు పెట్టారని తెలిసింది. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ప్రతిభావంతులను ఈ టీం కోసం ఎంపిక చేయనున్నారు. వీరికి ఆకర్షణీయమైన జీతభత్యాలు ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ఒక్కొక్కరికి ఒక్కో జిల్లా బాధ్యతలు కేటాయించనున్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి వీరంతా జిల్లాలకు వెళ్లి జనం నాడిని తెలుసుకోనున్నారు. నేరుగా సీఎం కార్యాలయానికి నివేదికల రూపంలో అందచేయనున్నారని చెబుతున్నారు రాబిన్ శర్మ మొన్నటి ఎన్నికల్లో ఎన్నికల వ్యూహకర్తగా టీడీపీకి పనిచేశారు. ఆ టీం సేవలనే చీఫ్ మినిస్టర్ ఫెలోస్ లో ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ఖచ్చితమైన సమాచారాన్నినిర్మొహమాటంగా అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ టీంను ఏర్పాటు చేసుకున్నారు. ఉచితఇసుక, మద్యం పాలసీ, సూపర్ సిక్స్ హామీలు, ఉచిత గ్యాస్ వంటి పథకాలతో పాటు కూటమి పార్టీల కలయికపై కూడా జనం అభిప్రాయాలను ఎప్పటికప్పుడు ఈ టీం సేకరించి సీఎంవోకు అందచేయనుంది. అందులో ఏమైనా లోటు పాట్లు ఉంటే వెంటనే సరిదిద్దుకోవడానికి వీలవుతుందని చంద్రబాబు కొంత ఆర్థికభారమైనా మరోసారి గెలుపుకోసం ఈ టీంను ఏర్పాటు చేసుకన్నారని చెబుతున్నారు. చూద్దాం.. మరి రాబిన్ శర్మ ఈసారి ఎలాంటి ఫలితాలను చంద్రబాబుకు చెంతకు చేరవేస్తారనేది? అయితే చంద్రబాబుకు ఖచ్చితమైన సమాచారం వస్తుందా? రాదా? అన్నది కూడా తేలాల్సి ఉంది. ఎందుకంటే భాషతో సంబంధం లేకుండా, ఉన్నత విద్యచదువుకున్న వారికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు సరైన ఫీడ్ బ్యాక్ ఇస్తారా? అన్నది కూడా అనుమానమే.

# అంబేద్కర్ పార్క్ నిర్వహణ ఎలా

**విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** విజయవాడ నగరం నడిబొడ్డున సరిగ్గా ఏడాది క్రితం ప్రారంభించిన 206 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహ నిర్వహణ భారంగా మారిందని వివిధ ప్రభుత్వ శాఖలు చేతులెత్తేస్తున్నాయి. ప్రతి నెల రూ.21లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుండటంతో విగ్రహ నిర్వహణ భారాన్ని వదిలించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం పేరుతో ఈ ఏడాది జనవరిలో విజయ వాడలో 206 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. నగరం మధ్యలో ఉన్న పిడబ్ల్యూడి గ్రౌండ్స్‌లో 125 అడుగుల విగ్రహాన్ని 80 అడుగుల ఎత్తైన పీఠంపై ఏర్పాటు చేశారు.19ఎకరాల స్వరాజ్యమైదానంలో భారీ విగ్రహ నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా రాజకీయంగా లబ్ది కలుగుతుందని వైసీపీ భావించింది. రూ.200కోట్ల అంచనాలతో చేపట్టిన పనులు చివరకు రూ.400కోట్లకు పెరిగిపోయాయి. తెలంగాణలో అందులో సగం ఖర్చుతోనే అన్ని పనుల్ని పూర్తి చేశారు. ఏపీలో ఖర్చు అంచనాలను మించిపోయినా ఇంకా పనులు మాత్రం పూర్తి కాలేదు. కొందరు ఐఏఎస్ అధికారులు విగ్రహ నిర్మాణంలో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నా దానిపై ఎలాంటి విచారణ చేయలేదు.అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో భాగంగా చేపట్టిన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు స్మృతి వనం నిర్వహణకు ప్రతి నెల రూ.21లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోం ది. ఇంత డబ్బును వెచ్చించడం తమకు భారం అవుతోందని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం భావిస్తున్నాయి. విగ్రహ సందర్శన, ఎంట్రీల కోసం వసూలు చేస్తున్న ఫీజులతో నెలకు రూ.ఐదారు లక్షలు కూడా ఆదాయం రావడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టును ఎలా వదిలించుకోవాలనే యోచనలో ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. దీనికి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వా నించాలని ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఉంది.అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం ఉన్న ప్రాంగణాన్ని ఆదాయం వచ్చేలా తీర్చుదిద్దాలనే ఆలోచన ఉన్నా దానిపై ఎలా ముందుకు వెళ్లాలనే విషయంలో స్పష్టత కొరవడింది. ఇటీవల ఈ ప్రాంగణంలో అనధికారిక ప్రదర్శన ఏర్పాటు చేయడంతో అంబేద్కర్ విగ్రహంపై ఈ రగడ మొదలైంది. అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించిన ఇరిగేషన్ శాఖకు చెందిన పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌ను స్వరాజ్య మైదాన్‌గా గుర్తింపు ఉంది. స్వాతంత్ర్యానికి ముందు నుంచి నగరంలో సువిశాలమైన ప్రాంగణానికి గుర్తింపు ఉంది. ఈ ప్రాంగణానికి ఘనమైన చరిత్ర ఉంది. విజయవాడ నగరంలో మధ్యలో విగ్రహ ఏర్పాటు ద్వారా ఓటర్లకు చేరువ కావాల నే ఉద్దేశంతో నగరం మధ్యలో విగ్రహ ప్రతిష్టాపన చేసినా అది ఫలించలేదు. విగ్రహ నిర్మాణానికి ముందు పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో క్రమం ప్రైవేట్ ఎగ్జిబిషన్లు నడిచేవి.ఈ ప్రాంగణం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చేతిలోకి వచ్చాక కొందరు ఆదాయం కోల్పోయారు. ఇటీవల విగ్రహ ప్రాంగణంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడంతో రగడ మొదలైంది. ఓ వైపు ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదంటూనే ప్రైవేట్ ప్రదర్శనలు ఏర్పాటు చేయ డంపై ప్రత్యర్థులు ప్రచారం ఉధృతం చేశారు. జిల్లా యంత్రాంగం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నిర్వాకంతో ఈ రగడ మొదలైనట్టు తెలుస్తోంది.విజయవాడ నగరం మధ్యలో సువిశాలమైన స్థలంతో పాటు పార్కింగ్ సదుపాయాలతో ఉన్న ప్రాంగణాన్ని విదేశీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు అవసరమైన డిజైన్లను కూడా రూపొందించారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు కోట్లాది రుపాయల్ని ప్రైవేట్ హోటళ్లకు చెల్లిస్తున్నారు. విజయవాడలో నిర్మిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటే ప్రభుత్వానికి ఖర్చు కలిసొచ్చే అవకాశం కూడా ఉంటుంది. ప్రైవేట్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు కమిషన్ల ప్రాతిపదికన పెద్ద ఎత్తున బిల్లులు చెల్లించడానికి ఏపీ ప్రభుత్వ శాఖలు అలవాటు పడిపోయాయి.అంబేడ్కర్ పార్క్‌లో ఆడిటోరియం, మ్యూజియం, కాన్ఫరెన్స్ హాళ్లలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచించడం లేదు. ఈ హాళ్లను ప్రైవేట్ కార్యక్రమాలకు కూడా అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుంది.మరోవైపు అంబేద్కర్ పార్క్ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడంపై ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో రూ.400కోట్లతో నిర్మించిన పార్క్ నిర్వహణను ప్రైవేట్ వారికి కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.గత పాలకుల అసమర్థత, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి తీరని నష్టం జరిగింది. విధ్వంసమైన వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నాము. భావితరాలకు ఉపయోగపడే గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై ప్రజల్లో చర్చ జరగాలని ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు హైబ్రీడ్ విధానంలో ప్రైవేటు పార్టనర్ షిప్‌ను చేర్చే అంశాన్ని ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే ప్రాజెక్టు గురించి కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించానని డీపీఆర్ పూర్తి చేసి 2–3 నెలల్లో టెండర్లు పిలుస్తామన్నారు. సకాలంలో నిధులు అందితే మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు.

## భైంసాలో కొనసాగుతున్న బంద్



**నిర్మల్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01:** నిర్మల్ జిల్లా భైంసాలో బంద్ కొనసాగుతోంది. నాగదేవత ఆలయంలో చోరీకి నిరసనగా హిందూ వాహిని ఇచ్చిన పిలుపు మేరకు దుకాణ సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాయి. కాగా, నాగదేవత ఆలయంలో చోరీ కేసులో పలువురు నిందితులను పోలీసులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటచేసుకోకుండా చూసేందుకు పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భైంసా పట్టణ శివారులోని నాందేడ్ వెళ్లే మార్గంలో ఉన్న నాగదేవత ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయ మెయిన్ గేటు తాళాన్ని పగులగొట్టి హుండీలోని కానుకలను దోచుకెళ్లారు. ఉదయం 9 గంటలకు స్థానికులు ఆలయానికి వెళ్లినప్పుడు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా, భైంసా పరిసరాల్లోని ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు అరికట్టకపోవడంపై హిందూవాహిని ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ బంద్‌కు పిలుపునిచ్చారు. నాగదేవత ఆలయంతో పాటు ఇటీవల భైంసా పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, నరసింహ స్వామి ఆలయం, పంచముఖి హనుమాన్ ఆలయాల్లో వరుసగా చోరీలు జరగడం ఆందోళన కలిగించాయి.

నియామకం కోసం టీ పీసీసీ అన్వేషణ మొదలుపెట్టింది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న మధుసూదన్ రెడ్డి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మధుసూదన్ రెడ్డి అధ్యక్ష పదవికి ఎన్నికై రెండేళు గడిచిపోవడం, ఆయన ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో జిల్లా అధ్యక్షుడు నియామకం కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కసరత్తులు మొదలుపెట్టినట్టు తెలుస్తుంది. గడిచిన ఆసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిక్యాన్ని చాటింది. మొత్తం 14 సీట్లలో 12 చోట్ల విజయం సాధించింది.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మధుసూదన్ రెడ్డి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించారు. జిల్లాలోని మహబూబ్ నగర్, దేవరకద్ర, జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. డిసిసి అధ్యక్షుడిగా ఎన్నికైన మధుసూదన్ రెడ్డి ఆ పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేకూర్చాడని టాక్ కూడా ఉంది. ఇక మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని జడ్చర్ల , మహబూబ్ నగర్ , దేవరకద్ర మూడు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు . ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటూ అందరినీ సమన్వయ పరుస్తూ, ప్రతిపక్షాలు ప్రభుత్వం పై చేసే విమర్శలను తిప్పికొడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు ఉన్న వారే కావడంతో అందరినీ మెప్పించి, ఒప్పించి వారిలో ఒక్కరిని అధ్యక్షుడిగా ఎంపికచేయడం పీసీసీకి తలకు మించిన భారంగా మారిందట. మహబూబ్ నగర్ జిల్లాలో గల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకులనే జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని అధిష్ఠానం పై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఓటు బ్యాంకు ఉన్న మూదిరాజ్ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేష్, జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న ముస్లిం వర్గంలోని జహీర్ అక్తర్, రబ్బానీ, సిరాజ్ ఖాద్రీ ల పేర్లు కూడా బలంగానే వినిపిస్తున్నాయి. కాగా, ఇప్పటికే పార్టీ అధిష్ఠానం, కొన్ని పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. మహబూబ్ నగర్ ఎమ్మెల్యేలతో టీపీసీసీ చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది.మొత్తంగా డీసీపీ నుంచి ఆరడజను మంది నేతలు పోటీ పడుతుండటంతో.. పార్టీ హైకమాండ్ ఎటు తేల్చుకోలేక పోతుదంట. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ డీసీసీ పదవి విషయంలో నేతల నుంచి అసంతృప్త జ్వాలలు ఎగిసిపడకుండా బంతిని ఎమ్మెల్యేల కోర్టులోనే వదిలేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో డీసీసీ పీఠంపై కూర్చునే నేతలేవరో తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే అంటున్నారు.

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భావిస్తున్నారు. అయితే ఇందుకోసం పార్టీ పరిస్థితులపై తెలంగాణలో సర్వేలు కూడా చేయించారన్న వార్తలు వస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ టీం సర్వే చేసి కొన్ని నివేదికలను చంద్రబాబుకు ఇచ్చినట్లు సమాచారం అందుతుంది. తెలంగాణలో ఓటు బ్యాంకు ఉంది కానీ, నాయకత్వలోపం ఉందన్నది ఆ నివేదిక సారంశమట. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి చంద్రబాబు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. అయితే అందులో విజయావకాశాలపై ఆయన సర్వేచేయిస్తే నాయకత్వ లేమి పార్టీని వెంటాడుతుందని ప్రశాంత్ కిషోర్ టీం చెప్పిందని అంటున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి కనీసం కొన్ని స్థానాల్లో గెలిచినా.. గెలవకపోయినా తమకంటూ ఒక నాయకత్వం ఏర్పడుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. ఎటూ ఏపీలో అధికారంలో తెలుగుదేశం పార్టీ ఉంది కాబట్టి నిధులకు కొరత లేదు. నిధులను వెచ్చించయినా కొన్ని చోట్ల పసుపు జెండాను తెలుగుదేశం జెండాను ఎగురవేయగలిగితే పార్టీకి పూర్వ వైభవం వచ్చినట్లేనని ఆయన లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్లు నాయకత్వం ఉన్న పార్టీలకు అవకాశం మాత్రం లేదన్నది అందరికీ తెలిసిందే. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నిధులు, నీళ్లు. నియామకాలపైన. తిరిగి వీరి చేతుల్లో పడితే వాటిలో తమకు అన్యాయం జరుగుతుందని సహజంగానే తెలంగాణ ప్రజలు భావిస్తారు. మొన్నటి వరకూ మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో టీడీపీ కొంత కనిపించినా ఇప్పుడు కేవలం ఖమ్మం జిల్లాలోనే అక్కడక్కడా కనిపిస్తుంది ఖమ్మం జిల్లాలో అది కూడా గెలిచేంత స్థాయిలో టీడీపీ లేదన్నది వాస్తవం. అదే పరిస్థితుల్లో ఖమ్మం జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం కొందరిని మాత్రం ఓడించగలరన్నది అంతే నిజం. ఇక హైదరాబాద్ నగరంలో టీడీపీని అభిమానించే వారున్నప్పటికీ వారి ఓట్లు ఇటు వైపు మరిలే అవకాశాలు లేవనే అనిపిస్తుంది. ఇక్కడ సెటిలయిన వారు కూడా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు అనుకూలంగా మారిపోయిన తర్వాత ఇన్నేళ్లు గ్యాప్ ఇచ్చి ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావడం అత్యాశే అవుతుందన్నభావన వారిలో ఉంటుంది. అందుకే చంద్రబాబు కేవలం తెలుగుదేశం పార్టీకి జాతీయ హోదా కోసం పోటీకి దిగవచ్చునేమో కానీ.. గెలవడం మాత్రం అంత ఈజీ కాదు.

## అమెరికా హోటళ్లలో భారతీయులకు పెరిగిన మర్యాద..

**మనోళ్ల కోసం అక్కడి హోటళ్లలో టీ, సమోసా, భారతీయ టీవీ ఛానెల్స్!**
**భారత పర్యాటకులను ఆకర్షించేందుకు అమెరికన్ హోటళ్ల వినూత్న పంథా**
**గతేడాది అమెరికాలో పర్యటించిన 19 లక్షల మంది భారతీయులు**
**2019తో పోలిస్తే 48 శాతం వృద్ధి నమోదైందన్న ఎన్‌టీటీఓ డేటా**
**విజిటింగ్, బిజినెస్ వీసాలు పెరగడం ఇందుకు కారణం**



ఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: భారత పర్యాటకులను ఆకర్షించేందుకు అమెరికన్ హోటళ్లు వినూత్న పంథా అనుసరిస్తున్నాయి. టీ, సమోసా అమ్ముతున్నాయి. లాంజుల్లో భారతీయ టీవీ ఛానళ్లను పెడుతున్నాయి. యూఎస్ నేషనల్ ట్రావెల్ అండ్ టూరిజం ఆఫీస్ (ఎన్‌టీటీఓ) డేటా ప్రకారం 2024లో 19 లక్షల మంది భారతీయులు అమెరికాలో పర్యటించారు. 2019తో పోలిస్తే 48 శాతం వృద్ధి నమోదైంది. విజిటింగ్, బిజినెస్ వీసాలు పెరగడం ఇందుకు కారణం. వ్యాపార సందర్శనల కోసం జారీ చేసే బిజినెస్ వీసాలు 50 శాతం పెరిగాయి. అలాగే పర్యటనల కోసం ఇచ్చే విజిటింగ్ వీసాలు 43.5 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. అందుకే అమెరికాకు మనోళ్లు భారీగా క్యూ కట్టారు. దీన్ని తమకు అనుకులంగా మార్చుకున్న అక్కడి హోటళ్లు భారతీయ పర్యాటకులను ఆకర్షించే పనిలో పడ్డాయి. హోటళ్ల లాబీలలో చాయ్, సమోసాలను పెట్టడంతో పాటు గెస్ట్ రూమ్‌లలో ప్రముఖ భారతీయ టీవీ చానెళ్ళను ప్రసారం చేస్తున్నాయని ఆసియన్ అమెరికన్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ సీఎం లారా లీ బ్లేక్ తెలిపారు. మరోవైపు చైనా, జపాన్, దక్షిణ కొరియా పర్యాటకుల శాతం 50 నుంచి 25 వరకు తగ్గిపోయిందని ఎన్‌టీటీఓ డేటా వెల్లడించింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా నుంచి వచ్చే సందర్శకుల సంఖ్య తగ్గగా, దాన్ని భారతీయ టూరిస్టులు భర్తీ చేస్తున్నారని లారా లీ బ్లేక్ పేర్కొన్నారు. అందుకే భారతీయులకు అమెరికన్ హోటల్స్‌లో మర్యాదలు పెరిగాయన్నమాట. ఇక 2024లో భారతీయ ప్రయాణికులు చేసిన యూఎస్ బుకింగ్‌లు 50 శాతం కంటే ఎక్కువ పెరిగాయని, 2019లో మహమ్మారికి ముందు ఉన్న స్థాయిల కంటే ఇది మూడు రెట్లు అధికమని ట్రిప్‌అడ్వైజర్ బ్రాండ్ ట్రావెల్ సంస్థ వయాటర్ తెలిపింది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి..

**-ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళండి**
**-హుస్నాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..**
**-మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు .హుస్నాబాద్ మండల కార్యకర్తలతో జిల్లాల్లగడ్డ గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని 17 గ్రామాల అధ్యక్షులు పార్టీ ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉండనున్నాయని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురాలని సూచించారు.అందుకోసం నేతలు ఇప్పటి నుండే వ్యూహాత్మకంగా పని చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ సూచించారు.ఆర్టీసీ లో మహిళలకు ఇప్పటి వరకు 126 కోట్ల మంది ఉచితంగా ప్రయాణం చేశారని,200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 రూపాయలకి గ్యాస్ అందిస్తున్నామని ఎవరికైనా ఇవి రాకపోతే గ్రామాల్లో పిర్యాదు చేయాలని సూచించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేసిందని ,ఇప్పటికే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో ఇప్పటికే నాలుగు లైన్ల రహదారి కుడల్ల అభివృద్ధి ,ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, సర్వాయి పెట్, మహాసముద్రం గండి ద్వారా హుస్నాబాద్ ను టూరిజం లో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే గౌరవెళ్ళి కాలువలు పూర్తి చేసి ఇక్కడి రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. హుస్నాబాద్ లో నిరుద్యోగులకు ఇతర దేశాలకు వెళ్ళే వారికి టాం కాం కంపెనీ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. అక్కన్నపెట్ లో పారిశ్రామిక కారిడార్ ,ఇక్కడి వారికి విద్యా ,వైద్యంలో తమ ప్రథమ ప్రాధాన్యత గా చెప్పుకొచ్చారు. ఇక్కడి ప్రజలకు అనారోగ్యం వచ్చినప్పుడు చెసుకోవడానికి ప్రత్యేక అధికారిని నియమించినట్లు వెల్లడించారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని ఇది పారదర్శకంగా జరుగుతుందని ఇందులో ఎవరి జోక్యం ఉండదని తెలిపారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. హైదరాబాద్ లో ఎన్ని సమావేశాలు ఉన్న హుస్నాబాద్ వారు వస్తె కలవడానికి వారికే ప్రాధానత్య ఉంటుందన్నారు. హుస్నాబాద్ కి 250 పడకల ఆసుపత్రి ,పెద్ద ఎత్తున రోడ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలోనే మంజూరు అయినా పనులకు శంకుస్థాపన చేసుకుంటామని వెల్లడించారు.

## లక్నోలో దారుణం

లక్నో, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణం జరిగింది. ఓ హోటల్‌లో తన తల్లితో పాటు నలుగురు చెల్లెళ్లను హత్య చేశాడు ఓ యువకుడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెంట్రల్ లక్నో డిప్యూటీ కమిషనర్ రవీణ త్యాగి తెలిపిన వివరాల ప్రకారం.. రాజధాని లక్నోలోని శరణ్‌జిత్ హోటల్‌లో ఓ యువకుడు తన తల్లి, నలుగురు చెల్లెళ్లతో దిగాడు. తల్లి, చెల్లెళ్లు గాఢ నిద్రలోకి జారుకున్న తర్వాత సోదరుడు అత్యంత దారుణంగా హతమార్చాడు. హోటల్ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను ఆలియా(9), అల్షియా(19), అక్ష(16), రహమీన్(18), తల్లి ఆస్మాగా పోలీసులు గుర్తించారు. నిందితుడు ఆర్షద్(24) ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆర్షద్ తన కుటుంబ సభ్యులను హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరంతా ఆగ్రాకు చెందిన వారని పోలీసులు పేర్కొన్నారు.

## క్లోజ్ కానున్న మూడు రకాల బ్యాంక్ అకౌంట్లు

ముంబై, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్ వ్యవస్థలో అనేక మార్పులు చేసింది. బ్యాంకు ఖాతాలకు సంబంధించి కొత్త నిబంధనలు జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఇది లక్షలాది ఖాతాదారులపై ప్రభావం చూపుతుంది. ఆర్బీఐ సూచనల ప్రకారం మూడు ప్రత్యేక రకాల ఖాతాలు మూసివేయబడతాయి. మోసాల కేసులను అరికట్టేందుకు ఆర్‌బీఐ ఈ చర్య తీసుకుంది. దీంతో బ్యాంకింగ్ రంగంలో పారదర్శకత, భద్రత రెండూ పెరుగుతాయి. కొత్త నిబంధనలతో మోసాల ప్రమాదం కూడా తగ్గుతుంది. ఈ మార్పుల గురించి ముందుగానే తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యం. తద్వారా మీరు మీ ఖాతా క్లోజ్ కాకుండా సేవ్ చేసుకోవచ్చుప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరగాళ్లు ప్రజల బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును దోచుకోవడానికి గద్దల్లా పొంచి ఉన్నారు. వారు మెసేజ్ లు, ఇమెయిల్‌లు, సోషల్ మీడియా పోస్ట్‌లలో ప్రమాదకరమైన లింక్‌లను పోస్ట్ చేయడం ద్వారా వ్యక్తుల సమాచారాన్ని సేకరించ డానికి ప్రయత్నిస్తున్నారు. లేదంటే ఫోన్ కాల్స్ లో అమాయకుల నుంచి బ్యాంకు, వ్యక్తిగత వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అప్పుడు వారు ఖాతా నుండి అదృశ్యమవుతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టేందుకు, కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక చర్యలు తీసుకుంటోంది. ఇది జనవరి 1, 2025 నుండి బ్యాంకింగ్ వ్యవస్థలో కొత్త నిబంధనలను అమలు చేస్తుంది.రిజర్వ్ బ్యాంక్ జనవరి 1 నుండి మూడు రకాల బ్యాంక్ ఖాతాలను మూసివేస్తుంది. ఇది బ్యాంకింగ్‌ను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా చేస్తుంది. కస్టమర్‌లను డిజిటల్ బ్యాంకింగ్‌ని ఉపయోగించమని ప్రోత్సహించడం , వారి కేవైసీ(నోయువర్ కస్టమర్) వివరాలను అప్‌డేట్ చేయడం కూడా దీని లక్ష్యం. కొత్త సంవత్సరంలో అమల్లోకి వచ్చే కీలక నియమాలు, అవి బ్యాంక్ కస్టమర్‌లను ఎలా ప్రభావితం చేస్తాయనే వివరాలను తెలుసుకుందాం.

డార్మెంట్ అకౌంట్లు : ఇవి చాలా కాలం పాటు, సాధారణంగా రెండేళ్లపాటు ఎలాంటి ట్రాన్సాక్షన్లు జరగని అకౌంట్లు.

ఇన్‌యాక్టివ్ అకౌంట్లు : కనీసం ఒక సంవత్సరం పాటు ఇన్‌యాక్టివ్‌గా ఉన్న అకౌంట్లు.

జీరో బ్యాలెన్స్ అకౌంట్లు : ఇవి ఎలాంటి డిపాజిట్లు లేదా యాక్టివిటీ లేని అకౌంట్లు. చాలా కాలం పాటు జీరో బ్యాలెన్స్ ఉంటే అకౌంట్లు. ఇన్ యాక్టీవ్ ఖాతాలు దుర్వినియోగం లేదా మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వాటిని మూసివేయడం వల్ల సిస్టమ్ సురక్షితంగా ఉంటుంది. అలాగే, చాలా కాలంగా ఉపయోగించని ఖాతాలను తొలగించడం వల్ల బ్యాంకులు తమ కార్యకలాపాలను మెరుగ్గా నిర్వహించగలుగుతాయి. కస్టమర్‌లు తమ ఐజఅ వివరాలను అప్‌డేట్ చేస్తారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగిస్తారు. యాక్టివ్ ఖాతాల వినియోగంతో, బ్యాంకులు తమ కస్టమర్ల అప్‌డేట్ వివరాలను నిర్వహిస్తాయి.బ్యాంక్ కస్టమర్లపై ప్రభావం బ్యాంక్ కస్టమర్లు తమ ఖాతాలను మూసివేయకుండా నిరోధించడానికి కొన్ని చర్యలు తీసుకోవచ్చు. ఐజఅ వివరాలను అప్‌డేట్ చేయండి. మీ వ్యక్తిగత వివరాలు అప్‌డేట్ అయ్యాయని నిర్ధారించుకోండి. అవి బ్యాంక్ ద్వారా ధృవీకరించబడ్డాయో లేదో క్రాస్ చెక్ చేయండి. క్రమం తప్పకుండా లావాదేవీలు నిర్వహించండి. చిన్న లావాదేవీలు కూడా మీ ఖాతాను యాక్టివ్‌గా ఉంచుతాయి. జీరో బ్యాలెన్స్ ఖాతాలను కూడా మూసివేయకుండా నిర్వహించాలి. కొత్త నిబంధనలకు అనుగుణంగా, సౌలభ్యం కోసం ఆన్‌లైన్ లేదా మొబైల్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించండి. ఈ నిబంధనలను అమలు చేయడంలో బ్యాంకులదే కీలకపాత్ర. వారు కొత్త నిబంధనల గురించి కస్టమర్‌లకు తెలియజేయాలి, వారి ఖాతాలను సక్రియంగా ఉంచడంలో వారికి సహాయపడాలి. డిజిటల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించాలి.

## ఫుల్లుగా మందేసి కరెంట్ తీగలపై పడుకున్న మందుబాబు..



పాలకొండ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని మన్యం జిల్లాలో పాలకొండ మండలం ఎం. సింగిపురం అనే గ్రామంలో ఓ వ్యక్తి మద్యానికి బానిస అయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగనిదే అతడికి పూట గడవదు. మద్యం తాగపోతే అతడు అడుగు కూడా బయటికి వేయలేడు. చేతులు వణుకుతాయి . మనిషి మొత్తం షేక్ అవుతుంటాడు. అలాంటి వ్యక్తి పీకలదాకా మద్యం తాగాడు. పైగా నూతన సంవత్సరం కావడంతో మరింతగా మద్యం తాగాడు. దీంతో అతడి శరీరం వణికి పోవడం మొదలుపెట్టింది. కాళ్లు తడబడటం ప్రారంభమైంది. ఆ మైకం నుంచి తట్టుకోలేక అతడు బయటికి వచ్చాడు. వచ్చి రావడంతోనే పక్కన ఉన్నవాళ్లను ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాడు. దుర్భాషలాడటం ప్రారంభించాడు. ఇదే మైకంలో ఏకంగా విద్యుత్ స్తంభం ఎక్కాడు. చుట్టుపక్కల వాళ్ళు వారించినప్పటికీ అతడు ఒప్పుకోలేదు. అదే మైకంలో అలానే స్తంభం ఎక్కాడు. దీంతో వెంటనే స్థానికులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సరఫరాను నిలిపివేయించారు. విద్యుత్ స్తంభం పెట్టిన అతడు తీగలపై పడుకున్నాడు. అక్కడ చాలాసార్లు తనదైన విన్యాసాలు చేశాడు. ఆ తర్వాత స్థానికులు స్తంభం పైకి ఎక్కి అతడిని కిందికి దింపారు. సోషల్ మీడియాలో సంచలనం: ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా హాల్ చల్ సృష్టిస్తున్నాయి.. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు అతడి తీరుపై మండిపడుతున్నారు. " మద్యం తాగడం అనేది ఇటీవల కాలంలో పెరిగిపోయింది. అకేషన్ తో సంబంధం లేకుండా అడ్డగోలుగా తాగడం.. ఇలా రోడ్లమీదకి రావడం పరిపాటిగా మారింది. జనం వైపరీతంగా తాగడం.. పనీ పాటా లేకుండా తిరగడం పెరిగింది. దీనికి తోడు అనారోగ్యాలు పెరిగిపోతున్నాయి. సరిగ్గా 40 సంవత్సరాలు కూడా నిండకుండానే కన్నుమూస్తున్నారు. ఇలా మద్యం తాగి అకాల మరణాలకు గురవుతున్న వారిలో ఎక్కువ శాతం యువత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వాలు మద్యం దుకాణాలను విరివిగా ఏర్పాటు చేస్తున్నాయి. మద్యం మీదనే వ్యాపారాలు సాగిస్తున్నాయి. ఆదాయం వస్తుందనే ఆశతో మద్యాన్ని విపరీతంగా పొంగిస్తున్నాయి. దీనివల్ల ఎన్నో సంసారాలు నేలకూలుతు న్నాయి. చాలామంది మహిళలు చిన్నతనంలోనే వితంతువులుగా మారుతున్నారు. ఇలాంటి పరిణామం అసలు మంచిది కాదు. దీనిని ప్రభుత్వాలు అరికట్టాలి. మద్యం వ్యాపారానికి చరమగీతం పాడాలి. కేవలం మద్యం మీదనే వ్యాపారం చేయడం కట్టిపెట్టాలి. సరికొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలి. ఇలా ప్రజలను ఇబ్బంది పెట్టి.. మద్యానికి అలవాటు చేసి ప్రభుత్వం ఖజానా నింపుకోవడం సరికాదు. ఇలాంటి విధానాలు దీర్ఘకాలంలో సమాజానికి తీవ్రమైన నష్టం చేకూర్చుతాయని".. సామాజిక మాధ్యమాలలో నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

### న్యూఇయర్ వేడుకల్లో అపశృతి.. ఒకరి మృతి

అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 01: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ సంతోషంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. విశాఖపట్నం గాజువాక పట్టణంలో వడ్లపూడి రజకవీధిలో నిన్న రాత్రి న్యూ ఇయర్ సెలబ్రెషన్స్‌లో భాగంగా క్రాకర్ కాలుస్తుండగా ఒక్కసారిగా పేలి,సుద్దమళ్ల శివ అనే వ్యక్తి నుదుడిపై తీవ్రగాయమై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే కూర్మన్నపాలెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని నిర్దారించడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు బోరున రోధించారు. బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ ఓవైపు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఓ టెస్టు గెలిచి రెండు టెస్టులు ఓడిపోయింది. ఇప్పుడు తప్పక గెలవాల్సిన సిడ్నీ టెస్టులో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తోంది. అయితే అన్నింటి కంటే పెద్ద సమస్యగా మారిన టెస్టు జట్టు కెప్టెన్సీ విషయంలో బీసీసీఐ సైతం మల్లగుల్లాలు పడుతోంది. టీమిండియాలో ఉన్న పరిమిత ఆప్షన్లే అందుకు కారణంగా కనిపిస్తున్నాయి. దీంతో రోహిత్ శర్మ సిడ్నీ టెస్టు తర్వాత తప్పుకుంటే కొత్త కెప్టెన్ ఎవరన్న చర్చ జరుగుతోంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ లో ప్రస్తుతం కంగారూలు 2-1 ఆధిక్యంలో ఉన్నారు. సిడ్నీలో ఎల్లుండి ప్రారంభమయ్యే చివరి టెస్టులో భారత్ తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్ లో గెలిస్తే సిరీస్ సమం చేసే అవకాశాలు, అలాగే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ రేసులో నిలిచే అవకాశాలు ఉంటాయి. అయితే ప్రస్తుతం టీమిండియా ఫామ్, కెప్టెన్ రోహిత్ శర్మ వ్యక్తిగత ప్రదర్శన, ఇతర ఆటగాళ్ల ఫామ్ ఇలా ఎటు చూసినా ఆందోళనకర పరిస్థితులే నెలకొన్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే సిడ్నీ టెస్టు తర్వాత రోహిత్ శర్మ తప్పుకుంటే పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. సిడ్నీ టెస్టు తర్వాత రోహిత్ శర్మతో పాటు కోహ్లీ కూడా జట్టుకు గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్నాయి. రోహిత్ చివరి నిమిషంలో నిర్ణయం మార్చుకుంటే తప్ప భారత్ కు కొత్త కెప్టెన్ ను వెతుక్కోక తప్పని పరిస్థితి. దీంతో పెర్త్ టెస్టులో కెప్టెన్సీ తీసుకుని భారత్ ను గెలిపించిన పేసర్ జస్ ప్రీత్ బుమ్రా ఇప్పుడు టెస్టు జట్టు కెప్టెన్సీ ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం జట్టుకు వైస్ కెప్టెన్ గా ఉన్న బుమ్రా కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. అయితే బుమ్రా తరచూ గాయాల పాలవుతుండటం, జట్టుకు అందుబాటులో ఉండకపోవడంతో అతన్ని నమ్మి టెస్టు కెప్టెన్సీ అప్పజెప్పే పరిస్థితీ లేదు. దీంతో బీసీసీఐ ఆలోచనలో పడింది. ఇందుకు బీసీసీఐ వద్ద ఉన్న మరో పరిష్కారం కెప్టెన్సీ విభజన. రోహిత్ తరహాలో బుమ్రా టెస్టు, టీ20 ఫార్మాట్లలో జట్టును నడిపించే పరిస్థితి లేదు. దీంతో టెస్టు జట్టుకు ప్రస్తుతానికి బుమ్రాను కెప్టెన్ గా ప్రకటించి వన్డేలకు కొత్త కెప్టెన్ ను వెతుక్కోవడమే మేలనిపిస్తోంది. రోహిత్ ఇంకా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకోలేదు. కాబట్టి ఎలాగో ఛాంపియన్స్ ట్రోఫీ వరకూ అందుబాటులో ఉంటాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ లలో ఒకరికి వన్డే కెప్టెన్సీ ఇచ్చే అవకాశాలున్నాయి. టీ20ల్లో ఎలాగో సూర్యకుమార్ యాదవ్ ఇప్పటికే మంచి కెప్టెన్ గా రాణిస్తున్నాడు. కాబట్టి ఇదే బీసీసీఐకి బెటర్ ఆప్షన్ లా ఉంది.

# ఉత్కంఠ పోరులో హైదరాబాద్ విజయం

**3 వికెట్ల తేడాతో కర్ణాటకపై గెలుపు**

**ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్**

**తిలక్ వర్మ, వరుణ్ గౌడ్ అసాధారణ బ్యాటింగ్**

**విజయ్ హజారే ట్రోఫీలో అహ్మదాబాద్ వేదికగా మ్యాచ్**

ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ సంచలన విజయాన్నందుకుంది. గ్రూప్-సీలో భాగంగా కర్ణాటకతో అహ్మదాబాద్ వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ తిలక్ వర్మ(106 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 99), వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109) అసాధారణ బ్యాటింగ్‌తో రెండు బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 320 పరుగులు చేసింది. ఆ జట్టు కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 124) సెంచరీ సాధించగా... ఆర్ సమరణ్(75 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 83) హాఫ్ సెంచరీతో రాణించాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు తీయగా.. మహమ్మద్, రోహిత్ రాయుడు తలో వికెట్ తీసారు. అనికేత్ రెడ్డి(2/40) రెండు వికెట్లు తీసాడు. అనంతరం లక్ష్య ఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్లకు 322 పరుగులు చేసి నెగ్గింది. చివర్లో తనయ్ త్యాగరాజన్(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25)కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దుబే(2/49), నికిన్ జోస్(2/45) రెండేసి వికెట్లు తీయగా.. అభిలాష్ శెట్టి, విద్యాదర్ పాటిల్, శ్రేయస్ గోపాల్ తలో వికెట్ తీసారు. భారీ లక్ష్యచేధనలో ఓపెనర్లు రోహిత్ రాయుడు(0), తన్మయ్ అగర్వాల్(35) విఫలమైనా.. తిలక్ వర్మ, వరుణ్ గౌడ్ కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించారు. ఈ కీలక భాగస్వామ్యం హైదరాబాద్‌కు విజయాన్నందించింది.

# డొమెస్టిక్ క్రికెట్‌లో శివాలెత్తించిన ఆయుష్ మాత్రే

## 117 బంతుల్లో 181 పరుగులతో తుఫాను సెంచరీ

ఆయుష్ మాత్రే తానేంటో చూపించాడు. తన బ్యాట్‌తో ముంబైకి పరుగుల వర్షం కురిపించాడు. నాగాలాండ్ బౌలర్ల బ్యాండ్ వాయించాడు. ఇదంతా కూడా విజయ్ హజారే ట్రోఫీలో జరిగింది. ఆ మ్యాచ్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా..! విజయ్ హజారే ట్రోఫీలో నాగాలాండ్‌తో ముంబై తలబడింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబైకి 17 ఏళ్ల ఆయుష్ మాత్రే, అంగ్క్రిష్ రఘువంశీ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కి 156 పరుగులు జోడించారు. ఆ తర్వాత అంగ్క్రిష్ ఔట్ అయినప్పటికీ.. ఆయుష్ మాత్రే క్రీజులో నిలబడి పరుగుల వరద పారించాడు. ఈ క్రమంలోనే తుఫాను సెంచరీతో తన జట్టు భారీ స్కోర్ సాధించేలా చేశాడు. నాగాలాండ్‌పై 117 బంతులు ఎదుర్కొన్న ఆయుష్ మాత్రే మొత్తంగా 181 పరుగులు చేశాడు. డబుల్ సెంచరీకి కేవలం 19 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. 154 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 11 సిక్సర్లు, 15 ఫోర్లు బాదాడు. ఈ 17 ఏళ్ల బ్యాటర్‌కు లిస్ట్ ఏ కెరీర్‌లో ఇది తొలి సెంచరీ. ఇక ఆయుష్ సెంచరీతో నాగాలాండ్‌పై ముంబై నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 403 పరుగులు చేసింది. లిస్ట్ ఏ క్రికెట్‌లో ముంబై జట్టు సాధించిన రెండో అత్యధిక స్కోర్ ఇది. కాగా, ఇటీవల ముగిసిన అండర్-19 ఆసియా కప్‌లో వైభవ్ సూర్యవంశీతో కలిసి ప్రత్యర్థులను చిత్తు చేశాడు ఈ 17 ఏళ్ల ఆయుష్ మాత్రే.



వైభవ్‌తో కలిసి జపాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌ను కేవలం 16 ఓవర్లలోనే ముగించాడు.



తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని నాలుగో టెస్టులో తీవ్రంగా నిరాశపరిచిన స్టార్‌ప్లేయర్ల ఆటతీరుపై గంభీర్ ఫ÷ర్ అయినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగివచ్చిన ఆటగాళ్లపై అతడు మండిపడినట్లు తెలుస్తోంది. ఇక చేసింది చాలు అని పేర్కొనట్లు సమాచారం. కొంతమంది ఆటగాళ్లు పేలవ షాట్లు ఆడి వికెట్లు కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కోచ్‌గా బాధ్యతలు చేపట్టగానే.. ఆటగాళ్లు వారి మార్గాల్లోనే ఆడేందుకు గంభీర్ ఆరు నెలలు స్వేచ్ఛ ఇచ్చాడని.. కానీ ఇప్పుడు అదంతా ముగిసిందని పలువురు అంటున్నారు. ఇప్పటినుంచి జట్టు వ్యూహాలకనుగుణంగా ఆడనివారిపై వేటు వేసే దిశగా చర్యలు ఉంటాయని అతడు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌కనుగుణంగా గంభీర్ తీసుకుంటున్న వ్యూహాలకు.. మైదానంలో ప్లేయర్ల ఆటతీరుకు మధ్య పొంతన ఉండటం లేదనే దానిపై చర్చ నడుస్తోంది. ఇటీవల ముగిసిన టెస్టులో రిషభ్ పంత్ బాధ్యతారాహిత్యంగా ఆడి వికెట్ సమర్పించు కున్నాడు. అదే మ్యాచ్‌ను కోల్పోవడంలో కీలకంగా మారింది. మరోవైపు కోహ్లీ మరోసారి తన బలహీనతను చాటుకొని స్లిప్‌లో చిక్కాడు. ఇక రోహిత్ శర్మ ఏ స్థానంలో వచ్చినా.. రాణించలేకపోతున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా ప్రారంభించినప్పటికీ.. చివరికీ తన పాత ఆటతీరునే కొనసాగించి విఫలమయ్యాడు. ఇలా సీనియర్ల ఆటతీరు గంభీర్‌ను బాధించిందని.. త్వరలోనే తీవ్రమైన చర్యలకు అతడు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాహుల్ ద్రవిడ్ అనంతరం హెడ్ కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. టీమ్‌ఇండియాకు మిశ్రమ ఫలితాలే వస్తున్నాయి. శ్రీలంకతో వన్డే సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాండ్‌పై వైట్‌వాష్, తాజా బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కోచ్‌పైనా విమర్శలు వస్తున్నాయి. జట్టు ఎంపిక విషయం, వ్యూహాల్లో గంభీర్ పాత్ర ఏంటనే దానిపై పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు.

# మీరు ఇప్పటికైనా మేల్కొన్నారా..!?



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో టీమిండియా వెనుకబడింది. విజయంతో సిరీస్‌ను ప్రారంభించిన భారత జట్టు గత 3 మ్యాచ్‌ల్లో 2 ఓడిపోగా, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. మెల్‌బోర్న్ టెస్ట్‌లో కూడా టీమిండియా చాలా చెత్త ప్రదర్శన చేసింది. యంగ్ ప్లేయర్లు జైస్వాల్, నితీశ్ కూమార్ రెడ్డి, పేసర్ బుమ్రాలు తప్ప మిగితా ఎవరు పెద్దగా పదర్శన కనబరచలేదు. ఇది ఇలా ఉంటే ఈ ఏడాది తొలిరోజే ఓ షాకింగ్ న్యూస్ వెలుగులోకి వచ్చింది. టీమ్ ఇండియా డ్రెస్సింగ్ రూమ్ విషయం లీక్ అయింది. మీడియా కథనాల ప్రకారం, టీమ్ ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతవరణం అంతా బాగా ఏమి లేదని తెలుస్తుంది. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి తర్వాత టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో పెద్ద దుమారమే రేగింది. దీంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. భారత బ్యాట్స్‌మెన్‌ల ఆటతీరుపై గౌతమ్ గంభీర్ ఏమాత్రం సంతోషంగా లేడని, మెల్‌బోర్న్ మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత రోహిత్ శర్మ-విరాట్ కోహ్లి సహా మొత్తం భారత జట్టుపై గంభీర్ డ్రెస్సింగ్ రూమ్‌లోనే విరుచుకుపడ్డినట్లు తెలుస్తుంది. గంభీర్ ఆటగాళ్లను ఉద్దేశించి మీరు ఇప్పటికైనా మేల్కొన్నారా అని తిట్టినట్లు తెలుస్తుంది. అంతే కాకుండా భవిష్యత్తులో తన వ్యూహాన్ని పాటించని వారిని కూడా జట్టు నుంచి తప్పించే అవకాశం ఉందని గంభీర్ ఆటగాళ్లను హెచ్చరించాడు. జూలై 9న కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన గంభీర్ ఇప్పటివరకు ఆటగాళ్లకు స్వేచ్ఛనిచ్చాడు. అయితే, ఇటీవల పేలవమైన ఆటతీరుతో విసిగిపోయిన అతను ఇప్పుడు ఆటగాళ్లపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఫైట్‌తో పాటు.. టీమిండియా ఎంపిక విషయంలో కూడా ఓ పెద్ద విషయం రివీల్ అయింది. ఈ %దీ+ు% టెస్టు సిరీస్ గంభీర్‌కి ఇదే తొలి పర్యటన.. ఈ టూర్‌లో అనుభవం ఉన్న బ్యాట్స్‌మెన్ ఛటేశ్వర్ పుజారాను జట్టులోకి తీసుకోవాలని గంభీర్ భావించాడు. కానీ అతని మాటలను భారత సెలక్టర్లు అంగీకరించలేదు. ఆస్ట్రేలియాలో ఛతేశ్వర్ పుజారా గణాంకాలు బాగా ఆకట్టుకున్నాయి, క్రీజులో ఎక్కువ సమయం ఎలా గడపాలో అతనికి తెలుసు అని గంభీర్ సెలక్టర్లుతో చెప్పినట్లు సమాచారం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో రోహిత్ శర్మ జట్టులో లేరు. దీంతో జస్ప్రీత్ బుమ్రా జట్టుకు నాయకత్వం వహించాడు. అయితే బుమ్రాను కెప్టెన్‌గా చేయడానికి జట్టులోని ఒక ఆటగాడు ఇష్టపడలేదని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆటగాళ్ల మధ్య కొంత వైరుధ్యం ఉందని, అది ఆటపై ప్రభావం చూపుతున్నదని స్పష్టమైంది. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ నుండి ఈ విషయాలన్నీ లీక్ కావడంతో భారత క్రికెట్‌లో కలకలం రేగింది. దీనిపై క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కూడా ఒక పోస్ట్‌లో డ్రెస్సింగ్ రూమ్ లీక్ కావడంపై తన అభిప్రాయాన్ని తెలిపారు. 'డ్రెస్సింగ్ రూమ్‌లో ఏమి జరుగుతుందో డ్రెస్సింగ్ రూమ్‌లో మాత్రమే ఉండాలి!' ఆయన పేర్కొన్నాడు.

# సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మార్పులకు బీసీసీఐ కసరత్తు

2024లో టీమిండియా ప్రదర్శన ఆశాజనకంగా ఏమి లేదు. గతేడాది టీ20 ప్రపంచకప్‌ను గెలవడమే కాకుండా టీమిండియా రాణించలేకపోయింది. ఓ వైపు జట్టులోని స్టార్ ప్లేయర్లు చేతులు ఎత్తివేయగా, మరోవైపు యువ ఆటగాళ్లు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేశారు. అందువల్ల 2025లో టీమిండియా వెటరన్లకు బీసీసీఐ పెద్ద ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని, సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చాలా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పలువురు క్రికెట్ నిపుణలు చెబుతున్నారు. ప్రస్తుతం ఏం గ్రేడ్‌లో ఉన్న ఆటగాళ్లను డిమోట్ చేసే అవకాశం ఉంది. అలాగే జైస్వాల్, నితీష్ రెడ్డి లాంటి యువ ఆటగాళ్లు మంచి ప్రదర్శన కనబరిచే అవకాశం ఉంది. 2024లో టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌లో లేడు. అందువల్ల రోహిత్ పేలవమైన ప్రదర్శన కారణంగా బీసీసీఐ ఏం గ్రేడ్ నుండి ఏ గ్రేడ్‌కి తగ్గించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏం గ్రేడ్‌లో ఉన్న రోహిత్ ఏటా రూ.7 కోట్లు జీతం పొందుతున్నాడు. కానీ ఏ గ్రేడ్ కు దిగజారితే ఏడాదికి రూ.5 కోట్లే వస్తాయి. విరాట్ కోహ్లి రోహిత్ లాగే అంతగా పదర్శన ఏమి చేయడం లేదు. దీంతో విరాట్‌ను కూడా ఏ గ్రేడ్‌కి తగ్గించే అవకాశం ఉంది. ఈ ఏడాది టెస్టుల్లో 1478 పరుగులతో యశస్వి జైస్వాల్ సత్తాచాటాడు. అందువల్ల బీసీసీఐ కాంట్రాక్ట్‌లో జైస్వాల్‌కు పదోన్నతి లభించే అవకాశం ఉంది. జైస్వాల్ ప్రస్తుతం రూ.3 కోట్ల వార్షిక వేతనంతో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో బి గ్రేడ్‌లో ఉన్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుత ప్రదర్శన చేశాడు.

యదార్థవాది తెలుగు దినపత్రిక






# హీరోయిన్లు చూపులు మాత్రం బాలీవుడ్‌పై



తెలుగు చిత్ర పరిశ్రమలో నచ్చుకున్నంత క్రేజ్ ఉంది.ఇక్కడ నిర్మాతలు హీరోయిన్లను నెత్తిన పెట్టుకుని చూసుకుంటారు, దర్శకులు ప్రత్యేక పాత్రలు రాసి పిలుస్తారు. కానీ, మన హీరోయిన్ల చూపులు మాత్రం బాలీవుడ్‌పైనే నిలుస్తున్నాయి. నార్త్ ఇండియా మన సినిమాలను కొనియాడుతుంటే,మన హీరోయిన్లు మాత్రం హిందీ సినిమా వైపే ఎందుకు ఆకర్షితులవుతున్నారు? ఒకప్పుడు బాలీవుడ్ అంటే ఆచరణం అనేవారు.కానీ ఇప్పటి పరిస్థితుల్లో అక్కడ సినిమాలకు పెద్దగా మార్కెట్ లేదు. మన సినిమాలే అక్కడ ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి.అయినా మన హీరోయిన్లు బాలీవుడ్ బాట పడటానికి కారణం ఒకటే- రెమ్యునరేషన్ ఇక్కడ హీరోయిన్లకు ఇస్తున్న పారితోషికంతో పోలిస్తే,బాలీవుడ్‌లో రెమ్యునరేషన్ రెట్టింపు. ఉదాహరణకు రష్మిక మందన్నను తీసుకుంటే, తెలుగులో ఎంత పెద్ద సినిమా చేసినా 2 కోట్లకంటే ఎక్కువ రావడం అరుదు. అదే బాలీవుడ్‌లో ఒక ప్రాజెక్ట్‌కే 5-7 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందిస్తారట.అంతేకాకుండా, జాతీయస్థాయిలో పాపులారిటీ కూడా ఫ్రీగా వస్తుంది.కీర్తి సురేష్ కూడా బాలీవుడ్‌లో "బేబీ జాన్" సినిమాలో పెద్ద మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకున్నారని ప్రచారం ఉంది.తెలుగులో ఆమెకి సాధారణంగా 2 కోట్లు మాత్రమే ఇస్తే, బాలీవుడ్‌లో ఆమె రెమ్యునరేషన్ డబుల్ అయిందట. అలాగే,సమంత వెబ్ సిరీస్‌ల ద్వారా నార్త్ ఇండియాలో మంచి ఆదరణ పొందుతున్నారు. ఇటీవల సిటాడెల్ సిరీస్ కోసం సమంత భారీ మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకున్నారు. ఆ సిరీస్ బ్లాక్‌బస్టర్ కావడంతో, ఆమెకు మరింత పాపులారిటీ వచ్చింది. మధ్యస్థాయిలో ఉన్న హీరోయిన్లు కూడా బాలీవుడ్‌లో మంచి అవకాశాలు అందుకుంటున్నారు. రెజీనా కసాంద్రా సన్నీ డియోల్ జాట్ సినిమాలో నటిస్తుండగా, రాశీ ఖన్నా వరుస సినిమాలతో అక్కడ బిజీగా ఉన్నారు. వీరిద్దరూ మంచి రెమ్యునరేషన్‌తో బాలీవుడ్‌లో నిలదొక్కుకుంటున్నారు. తెలుగు పరిశ్రమ ఎంతో పెద్దదైనా, బాలీవుడ్‌లో రెమ్యునరేషన్, జాతీయ స్థాయి గుర్తింపు మన హీరోయిన్లను ఆ కిందికి ఆకర్షిస్తోంది. ఇది తెలుగు ప్రేక్షకులకు నిరాశ కలిగించినా, హీరోయిన్ల భవిష్యత్తు దృష్ట్యా వారి నిర్ణయం సమర్థనీయం.

# రొమాంటిక్ హారర్ మూవీ ఓటీటీలో



ఇటీవల ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌పై హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌కి ఆదరణ పెరుగుతోంది. తమిళం, మలయాళం భాషల్లో సూపర్ హిట్ అయిన సినిమాలను తెలుగులోకి డబ్ చేసి విడుదల చేయడం కొత్త ట్రెండ్‌గా మారింది. ఈ నేపథ్యంలో మరో ఆసక్తికరమైన హారర్ రొమాంటిక్ చిత్రం "ఆరగన్" త్వరలో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమాలో మైఖేల్ తంగదురై, కవిప్రియ మనోహరన్, శ్రీరంజని కీలక పాత్రలు పోషించారు. అరుణ్ కేఆర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, అక్టోబర్‌లో థియేటర్లలో విడుదలైంది.మిక్స్ టాక్ వచ్చినప్పటికీ, చిత్రంలో ఉండే మైండ్ బ్లోయింగ్ ట్విస్టులు, ప్రధాన జంట మైఖేల్-కవిప్రియ కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు %×వీణఎ%లో 8.4 రేటింగ్ వచ్చి, ప్రేక్షకుల నుండి మంచి ప్రశంసలు అందుకుంది. డిఫరెంట్ కాన్సెప్ట్ ఉన్నప్పటికీ, డైరెక్షన్ పరంగా కొంత మెరుగుదల అవసరమని విమర్శలు ఎదుర్కొంది. అయినా, యాక్టింగ్, ఎమోషనల్ డ్రామా, హారర్ ఎలిమెంట్స్ సినిమాను ప్రత్యేకత కలిగించాయి. తమిళ్ సినిమా "ఆరగన్"కు ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. జనవరి 3 నుంచి ఈ సినిమా ఆహా తమిళం ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమ్ అవుతుంది. అయితే, ఇది తెలుగులో కూడా స్ట్రీమింగ్ అవుతుందా అనే క్లారిటీ ఇంకా రాలేదు. కానీ హారర్ ఫాంటసీ కథలను ఇష్టపడే తెలుగు ప్రేక్షకులు కూడా దీనిని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఓటీటీలో హారర్ సినిమాల ప్రభావం తాజాగా థియేటర్లకు వచ్చే సినిమాలు చాలా త్వరగా ఓటీటీలోకి చేరుతున్నాయి. "ఆరగన్" కూడా థియేటర్ రిలీజ్ తర్వాత మూడు నెలల వ్యవధిలో ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. హారర్ ఫాంటసీ కథాంశాలను ఇష్టపడే ప్రేక్షకుల కోసం "ఆరగన్" మళ్లీ ఆసక్తికర అనుభూతిని అందించనుంది.

# ఇంతవరకూ చూడని ఫైట్స్ చూపించే 'డాకు మహారాజ్'




హీరోలకు గల క్రేజ్ ను బట్టి వారు చేసే ఫైట్స్ ను కంపోజ్ చేయడం జరుగుతూ ఉంటుంది. కొన్ని ఫైట్స్ కోలీవుడ్ లో రజనీ చేయాలి .. మరి కొన్ని ఫైట్స్ టాలీవుడ్ లో బాలయ్య బాబు చేయాలని అంటూ ఉంటారు. ఎందుకంటే కొన్ని ఫైట్స్ వాళ్లు చేస్తేనే కరెక్టుగా అనిపిస్తాయి .. కనెక్టు అవుతాయి. అవి అసాధ్యాలైనా .. సాధ్యాలుగానే కనిపిస్తూ ఉంటాయి. ఈ కారణంగానే టాలీవుడ్ లో బాలయ్య సినిమాల నుంచి భారీ యాక్షన్ సీన్స్ ను అభిమానులు ఆశిస్తూ ఉంటారు. అలాంటి ఫైట్స్ 'డాకు మహారాజ్'లో పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు.

బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో 'డాకు మహారాజ్' రూపొందింది. సంక్రాంతి కానుకగా ఈ సినిమా జనవరి 12వ తేదీన విడుదల కానుంది. నాగవంశీ - సాయిసౌజన్య భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమాకి తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. బాబీ ఇంతకుముందు చేసిన 'వాల్తేరు వీరయ్య'ను మించి ఈ సినిమా ఉంటుందని నాగవంశీ చెప్పడం, బాలయ్య అభిమానులలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంటాయనీ, ఇంతవరకూ బాలయ్య బాబు సినిమాలలో చూడని యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సినిమాలో చూడొచ్చని బాబీ చెప్పడం మరింత హైప్ తీసుకొచ్చింది. బాలయ్య క్రేజ్ కి తగినట్టుగా .. ఆయన పవర్ ఫుల్ రోల్ కి తగినట్టుగా డిఫరెంట్ గా డిజైన్ చేయబడిన ఫైట్స్ విజిల్స్ వేయించడం ఖాయమని చెబుతున్నారు. ఇక తమన్ స్వరపరిచిన మాస్ బీట్స్ కూడా బాలయ్య ఫ్యాన్స్ ఆకలి తీర్చనున్నాయి. జనవరి 12న విడుదలవుతున్న ఈ సినిమా ఏ స్థాయి రికార్డులను సెట్ చేస్తుందో చూడాలి.

# ప్రముఖ గాయని శివశ్రీని పెళ్లాడనున్న ఎంపీ తేజస్వి సూర్య



బెంగళూరు : దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున వరుసగా రెండోసారి గెలిచిన తేజస్వి సూర్య.. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను పెళ్లి చేసుకోబోతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్యనే బెంగళూరులో నిన్న ప్రకటించారు. మార్చి 24వ తేదీన బెంగళూరులోనే ఆయన వివాహం జరగనుంది.శివశ్రీ శాస్త్ర యూనివర్సిటీ నుంచి బయో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కాలేజీలో సంస్కృతంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ -2లో కన్నడ వర్షన్‌లో శివశ్రీఓ పాట ఆలపించారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు 2 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. తేజస్వి సూర్య వృత్తి రీత్యా లాయర్. కానీ ప్రస్తుతం ఆయన బెంగళూరు సౌత్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ఎంపీ ఎన్నికల్లో నూ ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 3.31 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. తేజస్వి చేతిలో కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ ఓడిపోయారు. 2020 నుంచి భారతీయ జనతా యువ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# సంక్రాంతి సినిమాలకు టికెట్ ధరల పెంపు?



ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల టిక్కెట్ల ధరలు భారీగా పెరగనున్నాయని ఒక అంచనా. ఈ సంక్రాంతికి ముగ్గురు అగ్ర హీరోలు నటించిన సినిమాలు రిలీజవుతుండగా టికెట్ పెంపుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ శంకర్ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కింది. అలాగే నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్, విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం పోటీబరిలో ఉన్న పెద్ద సినిమాలు. అందువల్ల వీటికి తొలి వారం టికెట్ ధరల పెంపు వర్తించనుందని భావిస్తున్నారు. ఈ మూడు సంక్రాంతి విడుదలలకు ఆంధ్రప్రదేశ్‌లో తేదేపా ప్రభుత్వం భారీ పెంపును మంజూరు చేస్తుందని టాక్ వినిపిస్తోంది. రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ అసాధారణ బడ్జెట్ తో తెరకెక్కిన చిత్రం. శంకర్ రాజీ లేకుండా లావిష్ గా తెరకెక్కించారు. దీనికోసం నిర్మాత దిల్ రాజు రాజీ అన్నదే లేకుండా బడ్జెట్ వెచ్చించారు. అందువల్ల గేమ్ ఛేంజర్ నిస్సందేహంగా పండుగకు అతిపెద్ద చిత్రం. టికెట్ ధరల పెంపుతోనే రికవరీ సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ఈ సినిమాకు రూ. సింగిల్ స్క్రీన్‌లలో రూ.135 పెంపుదల వర్తించే వీలుంది. అలాగే మల్టీప్లెక్స్‌లలో రూ.175 పెంచుతారు. షెడ్యూల్ చేసిన బెనిఫిట్ షోల కోసం టికెట్ ధర రూ. 600 (జీఎస్టీతో కలిపి) వరకూ ఉంటుందని అంచనా. కు మహారాజ్‌కు రూ. సింగిల్ స్క్రీన్‌లలో రూ.110 పెంపు ఉ ఒడనుండగా, మల్టీప్లెక్స్‌లలో రూ.135 పెంపు వర్తిస్తుందని అంచనా. బాలయ్య చిత్రానికి ఉదయం 4 గంటల నుండి బెనిఫిట్ షోలు షెడ్యూల్ చేసారు. బెనిఫిట్ షోల కోసం రూ.500 (జీఎస్‌టితో కలిపి) వరకూ ఉంటుందని అంచనా. వెంకటేష్ %-%సంక్రాంతికి వస్తున్నాం%-% చిత్రానికి సింగిల్ స్క్రీన్‌లకు రూ.75 అదనం కాగా, మల్టీప్లెక్స్‌లకు టిక్కెట్ రేటు పెంపుదల రూ. 100 వరకూ ఉంటుంది. మూడు చిత్రాలకు భారీ పెంపులు ఉండే ఛాన్సుంది. టికెట్ ధరల పెంపునకు అధికారిక జీవో జారీ అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఓపెనింగ్స్ భారీగా వచ్చే వీలుంది. అయితే సినిమాలో కంటెంట్ ప్రజలకు నచ్చితేనే లాంగ్ రన్ ఉంటుంది. మరోవైపు తెలంగాణలో టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలపై ఇంకా సందిగ్ధత నెలకొంది.

# పవన్ ఫ్యాన్స్‌కు న్యూ ఇయర్ గిఫ్ట్.. 'హరిహర వీరమల్లు' నుంచి ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి'



ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు . పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇందులో భాగంగానే నూతన సంవత్సరం కానుకగా హరిహర వీరమల్లు నుండి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్‌ను వెల్లడించారు. ఈ మూవీలో పవన్ కళ్యాణ్ పాడిన ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి' అనే పాటను జనవరి 06న ఉదయం 9 గంటల 6 నిమిషాలకి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. రూల్స్ రంజన్ దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM TELTEL/02022,
RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519.